RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 131 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | గురువారం,నవంబర్,13,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 131 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Thursday,November,13,2025 | PAGES : 8 RS : 4 /- |



## ఢిల్లీ పేలుడు బాధితులకు ప్రధాని మోడీ పరామర్శ..

**న్యూఢిల్లీ,నవంబర్,12:**ఢిల్లీ పేలుడు బాధితులను ప్రధాని నరేంద్ర మోడీ పరామర్శించారు. రెండు రోజుల భూటాన్ పర్యటన ముగించుకుని కొద్దిసేపటి క్రితం ఢిల్లీకి చేరుకున్న మోడీ.. ఎయిర్ పోర్టు నుంచి నేరుగా లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్( ఎల్ఎన్?జేపీ) ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడ ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనలో గాయపడిన క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్యం గురించి క్షతగాత్రులు, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 16 మంది క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, ఎర్రకోట ఘటనపై భూటాన్ వేదికగా ప్రధాని మోడీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఢిల్లీ పేలుడు కుట్రదారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ ఘటనలో మరణించిన 12 మంది బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని చెప్పారు.

### రాష్ట్ర కేబినెట్ సమావేశం

# ఈనెల 15కి వాయిదా..




**హైదరాబాద్, నవంబర్ 12,తెలంగాణ దిశ:** రాష్ట్ర కేబినెట్ సమావేశం ఈనెల 15న జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగే ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని సమా చారం. జూబ్లీహిల్స్ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు ఈనెల 14న జరగనుంది. అదేరోజు మధ్యాహ్నం కల్లా ఫలితం వెల్లడికానుంది. గెలుపుపై కాంగ్రెస్ పార్టీ ధీమాగా ఉంది. తమకు అందిన సమాచారం.. పార్టీ శ్రేణులు, నాయకులు మంత్రుల ద్వారా సేకరించిన సమాచారంతో పక్కాగా గెలుస్తామని, భారీ మెజార్టీ ఖాయమనే అంచనాలో ఉన్నారు. బీఆర్ఎస్?ఓడిపోతుందని తెలిసే నానాహంగామా చేస్తున్నదని కాంగ్రెస్..? భావిస్తోంది. ఇదిలా ఉండగా,గెలుపు తర్వాత ప్రభుత్వ పరంగా పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని తెలిసింది. అందుకేఓట్ల లెక్కింపు వరకు వేచిచూసి మరుసటి రోజు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇందులో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్లు, కాంగ్రెస్?ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయోత్సవాలు, ఇతర పలు అంశాలపై కీలక నిర్ణయం తీసుకోనున్నారని సమాచారం. ప్రజల ఆమోదంద్వారానే జూబ్లీహిల్స్ ఎన్నిక ఫలితం వచ్చిందనే ఉద్దేశంతో కీలక నిర్ణయాలు తీసుకోవడానికి ఒక అంగీకారానికి వచ్చినట్లు తెలిసింది. వాస్తవంగా ఈనెల 7న కేబినెట్సమావేశం జరగాల్సి ఉండగా, 12కు వాయిదా వేసినట్లు చెబుతున్నారు.



## శంషాబాద్ సహా దేశంలోని 5 విమానాశ్రయాలకు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ, నవంబర్ 12:ఢిల్లీ ఎర్రకోట వద్ద పేలుడు తర్వాత దేశవ్యాప్తంగా టెన్షన్ వాతావరణం కనిపిస్తోంది. ఈ పేలుడుకు ముందు స్లీపర్ సెల్ ఆపరేషన్ ను భద్రతాదళాలు భగ్నం చేసిన నేపథ్యంలో తదుపరి ఎక్కడ ఏం జరగబోతోందనే ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇటువంటి పరిస్థితులుల్లో తాజాగా ఇవాళ దేశవ్యాప్తంగా ఐదు ఎయిర్ పోర్టులకు బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది. హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, త్రివేండ్రం ఎయిర్ పోర్టులనుపేల్చేస్తామని అగంతకులు ఇండిగో ఎయిర్ లైన్స్ కార్యాలయానికి మెయిల్ పంపించారు. దీంతో అప్రమత్తమైన బాంబ్ స్క్వాడ్స్ ఐదు ఎయిర్ పోర్టుల్లో తనిఖీలు చేపట్టారు. శంషాబాద్ ఎయిర్ పోర్టుతో సహా హైదరాబాద్ వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

### కాళేశ్వరం పునరుద్ధరణకు

# కసరత్తు : మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, నవంబర్ 12,తెలంగాణ దిశ:** మేడిగడ్డ,అన్నారం, సుందిళ్ల ఆనకట్టల పునరుద్ధరణకు శాస్త్రీయ, సాంకేతిక విధానంలో కసరత్తు జరుగుతోందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆనకట్టల పునరుద్ధరణ సహా నీటిపారుదలశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై ఉన్నతాధికారులు, ఇంజనీర్లతో మంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. భారత రాష్ట్ర సమితి హయాంలో భారీ వ్యయంతో నిర్మించిన ఆనకట్టల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. మేడిగడ్డ ఆనకట్ట దెబ్బతినడానికి.. అన్నారం, సుందిళ్ల ఆనకట్టలో లీకేజీలకు గల కారణాలు, వైఫల్యాలను విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, జ్యుడీషియల్ కమిషన్ నివేదికలు పేర్కొన్నాయని తెలిపారు. డిజైన్లు – నిర్మాణం – నిర్వహణలో లోపాలు, సరైన నమూనా అధ్యయనాలు లేకపోవడాన్ని ఎన్డీఎస్ఏ నివేదిక ప్రధానంగా ప్రస్తావించిందని.. ఆర్థికపరమైన అవకతవకలు, ప్రణాళికాలోపాలను జ్యుడీషియల్ కమిషన్ పేర్కొందని తెలిపారు. అవకతవకలు, నిర్లక్ష్యం వహించినందుకు కొందరు అధికారులు, ఏజెన్సీలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ సిఫారసు చేసిందని మంత్రి పేర్కొన్నారు.రాజకీయ పరంగా, ఇంజనీర్ల స్థాయిలోనూ లోపాలు ఉన్నాయన్న మంత్రి.. ఆనకట్టలను సాంకేతిక విధానంలో సరిచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సీడీఓ లోపాలను కూడా విచారణ సంస్థలు ఎత్తిచూపినందున నైపుణ్యం కలిగిన సాంకేతిక సంస్థలు, కన్సల్టెంట్ల సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కన్సల్టెన్సీ సేవల కోసం పలు సంస్థలు ముందుకొచ్చాయని, 3 తుదిదశకు అర్హత సాధించాయన్న మంత్రి.. ఐఐటీ లాంటి సంస్థలతో కలిసి పనిచేసే వాటికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు.

### హైకోర్టు ఆదేశాల మేరకే

# ముందుకెళ్తాం : టీపీసీసీ చీఫ్



**హైదరాబాద్, నవంబర్ 12,తెలంగాణ దిశ:** ఈ రోజుల్లో రిగ్గింగ్ చేయడానికి సాధ్యపడదని.. అలా చేయడానికి పాత జమానా కాదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్అన్నారు. ఇవాళ గాంధీభవన్‌లో మీడియా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రిగ్గింగ్‌కు పాల్పడిందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు ఆయన సమాధానం ఇచ్చారు. తెలంగాణలో మరోసారి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. పదేళ్లు కాంగ్రెస్ సర్కారుకు ఎలాంటి ఢోకా లేదన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమైందని తెలిపారు. ప్రచారంలో మంత్రులతో పాటు ఇంచార్జ్ బాధ్యతలు తీసుకున్న ప్రతీ ఒక్కరూ బాగా పని చేశారని కితాబిచ్చారు. అయితే, పోలింగ్ పర్సంటెజ్ పెరిగి ఉండాల్సిందని.. పట్టణ ప్రజలు, యువత ముందుకు వచ్చి ఓటు వేయాల్సి ఉండే అంటూ కామెంట్ చేశారు. ఈ రోజుల్లో రిగ్గింగ్ చేయడం పాజిబుల్ కాదని.. ఇదేమి పాత జమానా కాదని కొట్టిపడేశారు. ఓడిపోతున్నామనే బాధతో బీఆర్ఎస్ వాళ్లు మాట్లాడుతున్నారని అన్నారు.దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలను రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. అదే నేడు జూబ్లీహిల్స్‌లో తమ పార్టీ అభ్యర్థికి ప్లస్ పాయింట్‌గా మారిందన్నారు. ప్రస్తుతం తెలంగాణ )లో పాజిటివ్ వేవ్ కనిపిస్తుందని.. మళ్లీ వచ్చేది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. లోకల్ బాడీ ఎన్నికలు కూడా త్వరలోనే జరగబోతున్నాయని.. హైకోర్టు ఆదేశాల మేరకు ముందుకెళ్తామని అన్నారు. మరోసారి ఏఐసీసీ పెద్దలతో మాట్లాడి.. ఆ విషయంపై స్పష్టత ఇస్తామన్నారు.

బీసీల కు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయాలని అనుకున్నామని.. కానీ కేంద్రంలోని బీజేపీ అడుగడుగునా అడ్డ పడుతోందన్నారు. ఇక కేబినెట్ విస్తరణ, మార్పుల విషయం అధిష్టానం చూసుకుంటుందని తెలిపారు. మరోవైపు డీసీసీ అధ్యక్షుల ప్రకటన ఏ క్షణమైన రావొచ్చన్నారు. ఇక సోషల్ మీడియాలో బీఆర్ఎస్ పార్టీ ఫేక్ సర్వేలతో టెంపరరీ గేమ్ ఆడుతోందని అన్నారు.

# శివసేన, ఎన్‌సీపీ పార్టీలు ఎవరివో తేల్చనున్న 'సుప్రీం'..!




## తుది విచారణకు ముహూర్తం ఫిక్స్..!

**న్యూఢిల్లీ,నవంబర్,12:**మహారాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తున్న రెండు కీలక ప్రశ్నలకు త్వరలోనే సమాధానం లభించనున్నది. రెండు ప్రధాన పార్టీలైన శివసేన, ఎన్‌సీపీ పార్టీ నేతల మధ్య విభేదాలతో రెండువర్గాలుగా చీలిపోయిన విషయం తెలిసిందే. రెండు పార్టీల మధ్య ఎన్నికల గుర్తుల మధ్య వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే, ఈ అంశంలో సుప్రీంకోర్టు జనవరి 21న తుది విచారణ జరుపనున్నది. ఏక్‌నాథ్ షిండే వర్గాన్ని శివసేనగా గుర్తించి.. విల్లు, బాణం ఎన్నికల గుర్తులను ఈసీ కేటాయించడాన్ని సవాల్ చేస్తూ శివసేన సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బుధవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం తుది విచారణను వాయిదా వేసింది. ఎన్‌సీపీ (అజిత్ పవార్)కి ఈసీ గడియారం గుర్తును కేటాయిం చడాన్ని ఎన్‌సీపీ (శరద్ పవార్) దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించింది. రెండు కేసుల్లోని అంశాలను గుర్తించి.. రెండు కేసులను కలిపి విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ కేసులో వచ్చే ఏడాది జనవరి 21న విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. అవసరమైతే జనవరి 22న విచారణ కొనసాగించేందుకు వీలుగా.. మరుసటి రోజు ఇతర అత్యవసర అంశాలపై జాబితా చేయొద్దని జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. శివసేన సీనియర్ తరఫున అభిషేక్ మను సింఘ్వి, దేవదత్ కామత్ హాజరయ్యారు. మరో వైపు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, ఎన్‌కే కౌల్ హాజరయ్యారు.పార్టీ పేరు, గుర్తును ఏక్‌నాథ్ షిండే వర్గానికి కేటాయించాలనే ఈసీ నిర్ణయాన్ని శివసేన (యుబీటీ) విమర్శించింది. 2022లో శివసేనలో రాజకీయ సంక్షోభం తర్వాత.. ఫిబ్రవరి 2023లో షిండే నేతృత్వంలోని వర్గానికి అనుకూలంగా ఎన్నికల కమిషన్ తన ఉత్తర్వును జారీ చేసింది. పార్టీలో మెజారిటీని నిర్ణయించడానికి కేంద్ర ఎన్నికల కమిషన్ విఫలమైందని.. ఎన్నికైన ఎమ్మెల్యేల్లో షిండే వర్గం బలం ఎక్కువగా ఉన్నట్లు అంచనా వేసిందని ఉద్ధవ్ థాకరే వర్గం వాదించింది. ఈ విషయం పెండింగ్‌లో ఉండగా శివసేన , బర్నింగ్ టార్చ్ గుర్తును ఉపయోగించాలని ఉద్ధవ్ థాకరే వర్గానికి సుప్రీంకోర్టు సూచించింద్. వర్గం సైతం 2024లో అజిత్ పవార్‌కు గడియారం గుర్తును కేటాయిం చాలనే ఈసీ నిర్ణయాన్ని శరద్ పవార్ వర్గం సవాల్ చేసింది. సుప్రీం కోర్టు శరద్ పవార్ వర్గానికి ట్రంపెట్ గుర్తును కేటాయిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

### ప్రజా సమస్యలు ప్రస్తావిస్తే..

# ఫ్లెక్సీలు తొలగిస్తారా..?

## – స్పందించిన కవిత

**నల్గొండ,నవంబర్,12,తెలంగాణ దిశ:** 'జాగృతి జనం బాట'లో భాగంగానల్లగొండ జిల్లాలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా కేంద్రంలో తన ఫ్లెక్సీలను తొలగించడంపై స్పందించారు. ఫ్లెక్సీలు తొలగించడానికి కవిత తప్పు పట్టారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పెద్ద మంత్రి అనుకున్నా అని విమర్శించారు. ప్రజా సమస్యలు ప్రస్తావిస్తే.. ఫ్లెక్సీలుతొలగిస్తారా? అంటూఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను తాను ప్రస్తావిస్తున్నా అని,చేతనైతే ప్రభుత్వం సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. నల్లగొండకు కల్వకుంట్ల కవిత రానున్న నేపథ్యంలో ఆమె అభిమానులు కటౌట్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.



నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన కటౌట్‌లు, ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించింది.నల్లగొండ జిల్లా కేంద్రంలో కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ%ౌ% 'తెలంగాణ వచ్చాక కూడా నల్లగొండ జిల్లాకు కృష్ణా జలాలు అందలేదు.

# ఎమ్మెల్యేల అనర్హత వేటు అంశంపై విచారణ వాయిదా!

**హైదరాబాద్,నవంబర్,12,తెలంగాణ దిశ:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠగా ఎదురు చూస్తున్న అనర్హత ఎమ్మెల్యేల వేటు అంశంపై విచారణలు కొనసాగుతూనే ఉన్నాయి. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకొవాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. మూడు నెలల్లో చర్యలు తీసుకొవాలని కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాలతో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చిన స్పీకర్ ఒక్కొక్కరిగా విచారిస్తున్నారు.

ఈ క్రమంలో ఇవాళ, రేపు జరగాల్సిన విచారణను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వాయిదా వేసినట్లు తెలుస్తోంది. అలాగే ఈ విచారణలను ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు సమాచారం అందుతుంది. షెడ్యూల్ ప్రకారం ఈ రోజు తెల్లం వెంకట్రావు, సంజయ్‌ల పిటిషన్లపై రెండోసారి విచారణ జరగాల్సి ఉంది. అలాగే 13న పోచారం, అరికెపూడి గాంధీను మరోసారి విచారించాల్సి ఉండగా.. వాయిదా వేశారు.

ఇదిలా ఉంటే మూడు నెలల్లో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించగా.. ఈ క్రమంలో ఇవాళ,రేపు జరగాల్సిన విచారణను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వాయిదా వేసినట్లు తెలుస్తోంది. అలాగే ఈ విచారణలను ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు సమాచారం అందుతుంది.

# తీరు మారిన కార్తీక వన భోజనాలు

## వన భోజనాలంటే కుల భోజనాలా...!?-ఎవరి ప్రయోజనాల కోసం....!!!

## కార్తీక వన భోజనాల అర్థం, అంతరార్థం మారిందా? మార్చ బడిందా? ఒక వేళ మార్చబడితే ఎవరి స్వార్థాల కోసం, ఎవరి స్వప్రయోజనాల కోసం ఈ మార్పు?

భారతదేశం... ఈ దేశంలోని ప్రతి ఆచారం, సంప్రదాయం వసుదైక కుటుంబ భావనను తెలియజేసేదిగానే ఉంటుంది. అటువంటి దేశంలో ఐకమత్యమనే ఉన్నతమైన భావనతో ప్రారంభమైన కార్తీక వన సమారాధనలు రాను రాను కొందరి స్వార్థ బుద్ధితో కుల సమారాధనగా మారిపోయాయి. ఐకమత్యాన్ని పెంచాల్సిన కార్తీక వన సమారాధనలు కాస్తా కులాల మధ్య ఐకమత్యం లోపించి కులాలు, వర్గాలుగా విడిపోవడానికి కారణం అవుతున్నాయా..,! అంటే అవును అనే సమాధానమే వినిపిస్తోంది. మహోన్నతమైన ఈ సంప్రదాయం, ఈ సంస్కృతి కులాల రంగు పులుముకుని సమాజాన్ని విభజించే విష సంస్కృతిగా మారుతూ వస్తోంది. దీని ప్రభావంతో దైనందిన జీవితంలో వ్యాపారాల్లో పనుల్లో సొంత కులస్తులకే మద్దతు పలికే దుస్థితి ఏర్పడింది. దీనివల్ల ఇతర కులాలకు కొన్ని కులాలు దూరమయ్యే పరిస్థితి కూడా లేకపోలేదు. అసలు కార్తీక మాసంలో వన భోజనాలు ఎందుకు చేసుకుంటామో తెలియజేసే పురాణ గాథ ఒకటి ఉంది. పూర్వం కార్తీక మాసంలో ఉసిరి చెట్టు కింద నైమిశారణ్యంలో మునులందరూ సూతమహర్షి ఆధ్వర్యంలో పచ్చటి చెట్లు జమ్మి, ఉసిరి చెట్ల మధ్య శివ కేశవులను ఆహ్వానించి బంధువులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరివార సభ్యులతో కలిసి పరమాత్మను, ప్రకృతిని ఆరాధించి ఆ ప్రకృతితో మమేకమై కులమత భేదాలు లేకుండా భోజనాలు చేసేవారని పురాణాలు చెబుతున్నాయి. దీనివల్ల చక్కటి ఆరోగ్యం, కులాల మధ్య ఐకమత్యం ఉండేదని పూర్వీకులు చెబుతున్నారు. అసలు మన హిందూ ధర్మం ప్రకారం హైందవ ధర్మంలో కులాలే లేవు వర్ణాలు తప్ప. కనుక ఈ కుల భోజనాలు అనేవి లేవు అనేది నిర్వంధమైన విషయం. కానీ ఇప్పుడు కార్తీక మాస వన భోజనాలంటే కుల భోజనాలు అన్నంతగా మారిపోయిన పరిస్థితి కళ్ళముందు కనిపిస్తుంది. పోనీ స్వంత కులాల వాళ్లయిన ఏమైనా ఐక్యతగా ఉన్నారా అంటే అది కూడా లేదు. ఎవరి దగ్గర పలుకుబడి ఉంటుందో, ఎవరి దగ్గర డబ్బు ఉంటుందో వారికి పెద్ద పీట వేస్తూ.. ఆర్థికంగా కింద స్థాయిలో ఉన్న వారిని చులకనగా చూసే పరిస్థితి అన్ని కులాల్లోనూ ఉంది. ఈ మాత్రం దానికి వనభోజనాలు అని పేరు పెట్టి ఆ వంకతో చందాలు వసూలు చేసి కొంత మంది పెద్దలు తమ జేబు నింపుకొనే పనిలో ఉంటున్నారనేది ఎక్కువగా వినిపిస్తున్న విమర్శ. ఇదంతా ఒకే ఎత్తు అయితే ఆధ్యాత్మిక భావనతో జరుపుకోవలసిన వన భోజనాలు కాస్త రాజకీయ వేదికలుగా మారడం అనేది మరొక ఎత్తు. కులాలుగా విడిపోయి జరుపుకుంటున్న వనభోజనాలకు రాజకీయ నాయకులు రావడం.. వచ్చి ఆ కార్యక్రమాన్ని రాజకీయ లబ్ధి కోసం మార్చు కోవడం పరిపాటిగా మారింది. దాంతో రాజకీయ నాయకులు అన్ని కులాల సమారాధన కార్యక్రమాలకు హాజరై ఆయా కులాలకు అది చేస్తాం, ఇది చేస్తాం అంటూ హామీలు ఇస్తున్నారు. రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని పిలుపునిస్తున్నారు. అక్కడితో ఆగకుండా ఏ కులానికి సంబంధించి వన భోజన కార్యక్రమానికి వెళితే ఆ కులాన్ని విపరీతంగా పొగడడం, కొన్నిచోట్ల అయితే విమర్శనాత్మక వ్యాఖ్యలు చేయడం కూడా అనేక సార్లు చూస్తూనే ఉన్నాం. ఇదే పరిస్థితి కొనసాగితే సామాజిక ఐకమత్యం విచ్ఛిన్నమై, ప్రమాదకర పరిస్థితులు వస్తున్నాయని పలువురు సామాజిక వేత్తలు, మేధావులు హెచ్చరిస్తూనే వస్తున్నారు. ఆధ్యాత్మికంగా సమాజ శ్రేయస్సు పరంగానే కాకుండా న్యాయపరంగా కూడా కార్తీక వన భోజనాలకు కులం రంగు పులమడం అనేది అతి పెద్ద తప్పిదం. గత నెల అలహాబాద్ హైకోర్టు కులం పై ఇచ్చిన తీర్పును అనుసరించి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. పోలీసు రికార్డుల్లో కుల ప్రస్తావన అభ్యంతరకర పరిణామాలకు దారి తీస్తోందంటూ అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తదనుగుణంగా చర్యలకు ఉపక్రమించింది. పోలీసు రికార్డులతోపాటు పబ్లిక్ నోటీసుల్లో ఎటువంటి కుల ప్రస్తావన ఉండరాదని స్పష్టం చేసింది. మోటారు వాహనాల చట్టం ప్రకారం వాహనాలపై కులం ఆధారితంగా స్టిక్కర్లు, నినాదాలను ప్రదర్శించరాదని కూడా తెలిపింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు, జిల్లా యంత్రాంగాలకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. కులపరమైన వివక్షను తొలగించాలంటూ ఈ నెల 16వ తేదీన హైకోర్టు వెలువరించిన ఆదేశాల మేరకు ఈ చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపింది. వాహనాలపై కులానికి సంబంధించిన స్టిక్కర్లు, నినాదాలను ప్రదర్శించే వారిపై చలాన్లు విధించాలని కూడా ఆయన అధికారులను ఆదేశించారు. పట్టణాలు, గ్రామాల్లో కులాలను గురించి గొప్పగా చెప్పుకుంటూ ఏర్పాటు చేసే బోర్డులను తొలగించాలన్నారు. ఈ వీధి లేదా ఈ ప్రాంతం ఫలానా కులానికి చెందినదంటూ బోర్డులను ఏర్పాటు చేయరాదన్నారు. రాజకీయ లాభాపేక్షతో కులం పేరుతో ర్యాలీలు, బహిరంగ కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేయరాదన్నారు. కులాలను గురించి గొప్పగా చెప్పుకుంటూ సోషల్ మీడియాలో వచ్చే కంటెంట్ పైన నిఘా ఉంచుతామన్నారు. కులాధారిత శత్రుత్వాన్ని ప్రచారం చేసే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలకు లోబడి పై ఆదేశాలకు అనుగుణంగా అధికారులు తక్షణమే స్పందించాలని, దిగువ స్థాయి అధికారులకు ఈ విషయంలో తగు శిక్షణను కూడా ఇవ్వాలని పేర్కొన్నారు. ఇకనైనా భారతదేశాన్ని, ఈ దేశ సంస్కృతి సంప్రదాయాలు, ఆచారాల వెనుక ఉన్న మహోన్నతమైన భావనను సరిగ్గా అర్థం చేసుకొని, కులాలకు అతీతంగా ఐకమత్యంగా కార్తీక వన భోజనాలను జరుపుకునే దిశగా అందరం అడుగులు వేయాలి. అప్పుడే సామాజిక ఐకమత్యం తద్వారా సమాజాభివృద్ధి జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.




సుంకర నరేష్
కాపు కుల వ్యవస్థ వ్యతిరేక ఉద్యమకారుడు

## తెలంగాణ దిశ కథనానికి స్పందన

### నిజాంపేట్ సర్వే నెంబర్ 191లో రెండు కొత్త గదులను పూర్తిగా కూల్చేశారు....!

# -నాలుగు పాత గదులు వదిలేశారు...!!



**కుత్బుల్లాపూర్, నవంబర్ 12, (తెలంగాణ దిశ) :** నిజాంపేట్ సర్వే నెంబర్ 191లో రెండు వేల గజాల ప్రభుత్వ స్థలం కబ్జా...ఇప్పటికే ఆరు గదుల నిర్మాణం...పాక్షిక కూల్చి వేతలకే రెవెన్యూ పరిమితం.... ఒక్కో 60 గజాల ఫ్లాట్ రూ. 30 లక్షలకు విక్రయం.... చోద్యం చూస్తున్న బాచుపల్లి రెవెన్యూ... శీర్షికతో తెలంగాణ దిశలో ప్రచురితమైన కథనానికి బాచుపల్లి రెవెన్యూ అధికారులు స్పందించారు. కొత్తగా నిర్మించిన రెండు గదులను, ఒక బేస్ మెంట్ ను పూర్తిగా కూల్చివేసిన అధికారులు పాత వాటిని మాత్రం వదిలేసి వెళ్లారు. సుమారు రెండు వేల గజాలలో కబ్జాదారులు ఇప్పటికే మొత్తం ఆరు గదులు నిర్మించిన విషయం విధితమే. ఒక్కో 60 గజాల ప్లాటును రూ. 25 నుండి రూ. 30 లక్షల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారుల ఉదాసీనత, స్థానిక రాజకీయ నాయకులు తోడు కావడంతో కబ్జాదారులు ఇష్టారాజ్యంగా అందిన కాడికి ప్రభుత్వ స్థలాలను కబ్జాలు పెడుతూ సింగిల్ రూమ్ లు నిర్మిస్తూ అమాయకులకు విక్రయాలు జరుపుతున్నారు. అధికారం ఎక్కడ ఉంటే అక్కడే తిష్ట వేసి వారి కింత వీరికింత అన్నట్లుగా వాటాలు పంచుకుంటూ ప్రభుత్వ స్థలాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 2007 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఈ 191 సర్వే నెంబర్ లో సుమారు 200 మంది లబ్ధిదారులకు 60 గజాల నివాస స్థలాలను అందించింది. అనంతరం సుమారు రెండు వేల గజాల ప్రభుత్వ స్థలం ప్రజా అవసరాల కొరకు ఖాళీగా వదిలేసింది. దీంతో స్థానికంగా నివసించే ఓ కబ్జాదారుడు ఆ స్థలంపై దృష్టి పెట్టాడు. స్థానిక నేతలను, మరి కొన్ని వర్గాలను కలుపుకొని అందులో ప్లాటింగ్ నిర్వహిస్తూ ఒక్కో ప్లాట్ ను 25 నుంచి 30 లక్షలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. రెవెన్యూ అధికారులు అడపదలపాం స్వల్ప మొత్తంలో డీమాలేషన్ నిర్వహించిన కబ్జాలు మాత్రం పూర్తిగా తీసివేయట్లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత సంవత్సరం కాలంగా ఈ కబ్జాకత నడుస్తూనే ఉంది. దీని నివారణకు రెవెన్యూ యంత్రాంగం ఎలాంటి పటిష్ట నిర్ణయాలు తీసుకోకపోవడంతో ఇక్కడ ప్రభుత్వ స్థలాన్ని చూపిస్తూ లక్షలాది రూపాయలకు ఆ స్థలాలను అమ్ముకుంటూ కబ్జాదారులు సొమ్ము చేసుకుంటున్నారు. గత కొంతకాలంగా మొత్తం ఆరు సింగిల్ రూమ్ లను నిర్మించి రెండు కోట్ల రూపాయలకు విక్రయించినట్లు ఆరోపణలు గుప్ప మంటున్నాయి. సర్వేనెంబర్ 191 సైదప్ప బస్తి ప్రభుత్వ స్థలంలో వెలుస్తున్న కబ్జాలను నియంత్రించడంలో బాచుపల్లి రెవెన్యూ అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ కబ్జాలను చేపట్టి బస్తీ నేత ఎవరు అధికారంలో ఉంటే వారిని కలుపుకొని వెళుతున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం అధికార పార్టీలో ఉన్న ఒక వర్గం నేత దగ్గరికి తరచూ వెళ్తూ తనకు సహకరించాలని కోరినట్లు అందుకు తగిన ఏర్పాట్లను మాట్లాడుకున్నట్లు సమాచారం. అయితే అదే పార్టీలోని మరో నేత ఇప్పుడు ఏర్పడిన కబ్జాలు పెట్టిన 6 రూములను కూల్చివేయాలంటూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు స్థానికంగా చర్చలు జరుగుతున్నాయి. అయితే ప్రభుత్వ స్థలంలో ఏర్పడుతున్న కబ్జాలను ఎప్పటికప్పుడే తీసివేయాల్సిన రెవెన్యూ అధికారులు ఎందుకు అలసత్వం వహిస్తున్నారు తెలియని పరిస్థితి. గతంలో స్థానిక తహసిల్దార్ ఫూల్ సింగ్ ఇక్కడ ఏర్పడుతున్న కబ్జాలపై సీరియస్ గా తీసుకోవడంతో కొంత మేర కబ్జాలు నియంత్రించినట్లు అయింది. జరుగుతున్న కబ్జాలపై స్థానిక మండల రెవెన్యూ అధికారులు పూర్తిగా దృష్టి సారించకపోతే జిల్లా కలెక్టర్, హైడ్రా అధికారుల దృష్టికి ఈ కబ్జాల కథలను తీసుకువెళ్లేందుకు స్థానికంగా పలువురు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సర్వే నెంబర్ 191 సైదప్ప బస్తి ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు అవుతున్న కబ్జాలను ఇప్పటికైనా పూర్తిస్థాయిలో తొలగించి వేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



## కమలానగర్ అయ్యప్ప ఆలయం వద్ద డేబ్రీస్ సమస్య

### జిహెచ్ఎంసి నిర్లక్ష్యం... భక్తులకు ఇబ్బంది





**ఏఎస్ రావునగర్, నవంబర్ 12, (తెలంగాణ దిశ) :**కాప్రా సర్కిల్ పరిధిలోని ఏఎస్ రావునగర్ డివిజన్ కమలానగర్ లో అయ్యప్ప స్వామి ఆలయం పక్కనే నెలల తరబడి పేరుకుపోయిన డేబ్రీస్



(భవన అవశేషాలు, చెత్త) రోడ్డుపైనే ఉండిపోవడంతో భక్తులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్తీక మాసం సందర్భంగా రోజూ వందలాది మంది భక్తులు అయ్యప్ప స్వామి దర్శనానికి ఆలయానికి వస్తుండగా, రోడ్డుపైన పేరుకుపోయిన మలినాలు ఇబ్బందికరంగా మారాయి. ప్రతి రోజూ ఇక్కడి రహదారిపై వాహన రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ప్రమాదాల భయం నెలకొంది. స్థానికులు పలుమార్లు జిహెచ్ఎంసి అధికారులకు, సిబ్బందికి ఫిర్యాదులు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పక్కనే ఉన్న భవనాల నిర్మాణ వ్యర్థాలను కూడా కొంతమంది అక్కడే పారబోసి పరిస్థితిని మరింత దారుణంగా మార్చుతున్నారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై పేరుకుపోయిన డేబ్రీస్ కారణంగా పాదాచారులు వెళ్లడం ప్రమాదకరం అయ్యింది. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా స్పందన లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకొని చెత్తా చెదారాన్ని, భవన శిబిరాలను తొలగించాలని స్థానికులు కోరారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## అసఫ్ జాహీస్ ఆభరణాలు - వరంగల్ వైభవం"

# కాఫీ టేబుల్ బుక్ ను ఆవిష్కరణ

### పరిశోధకులకు, పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగం : సిఎస్. రామకృష్ణారావు





**హైదరాబాద్, నవంబర్ 12, (తెలంగాణ దిశ) :** సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకట రమణ రచించిన "అసఫ్ జాహీస్ ఆభరణాలు – వరంగల్ వైభవం"అనే కాఫీ టేబుల్ బుక్ ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు బుధవారం ఆవిష్కరించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన ఛాంబర్ లో ఏర్పాటు చేసిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ సిహెచ్. ప్రియాంక కూడా హాజరయ్యారు. వరంగల్ నగరంలో అసఫ్ జాహీల హయాంలో నిర్మితమైన అద్భుత కట్టడాలు, వరంగల్ కేంద్రంగా పాలనను చేసిన సుబేదారుల వివరాలు వారి చరిత్రతో కూడిన ఈ కాఫీ టేబుల్ బుక్ చరిత్ర పరిశోధకులకు, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఉపయోగపడుతుందని సిఎస్ అన్నారు. పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వర్తిస్తూనే చారిత్రక అంశాలతో కూడిన ఈ కాఫీ టేబుల్ బుక్ ను వెలువరించడం అభినందనీయమని సిఎస్ ప్రశంసించారు. వరంగల్ అంటే... కాకతీయుల పాలన, వేయిస్తంభాల ఆలయం, ఖిలా వరంగల్, భద్రకాళి ఆలయం వెంటనే మదికి వస్తాయి. అయితే, వరంగల్ నగరంలో అడుగు పెట్టగానే కాజీపేట నుండి మామునూర్ వరకు నిజాం నవాబులు నిర్మించిన అద్భుతమైన భవనాలు, కాజీపేట రైల్వే స్టేషన్, ప్రస్తుత మిషన్ భగీరథ పథకమైన ఇంటింటికి తాగు నీరందించే ధర్మసాగర్ ఫిల్టర్ బెడ్ ఎన్నో ఉన్నాయి. వీటితోపాటు వరంగల్ కేంద్రంగా వరంగల్ సుబాహ్ గా ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలోని కొన్ని ప్రాంతాలు ఉండేవి. ఈ వరంగల్ సుబేదారులుగా ఎవరెవరు ఉన్నారు. వారి ప్రత్యేకతలేమిటి, ఈ విషయమై కొన్ని అరుదైన, విశేషాలతో కూడిన సమాచారంతో పాటు నిజాం నిర్మిత హెరిటేజ్ కట్టడాల ఫోటోలతో కలిపి ఈ "అసఫ్ జాహీస్ ఆభరణాలు – వరంగల్ వైభవం" కాఫీ టేబుల్ బుక్ ఉంటుంది. ఈ పుస్తకం చరిత్ర అధ్యయన వేత్తలు, విద్యార్థులు, చరిత్రపై ఆసక్తి ఉన్న వారికి ఎంతో ఉపయోగపడుతుంది.

# ఆందోళన కలిగిస్తున్న వరుస ప్రమాదాలు

### పలు కుటుంబాల్లో తీరని విషాదాలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. గత వారం కర్నూలు జిల్లాలో వేమురి కావేరి బస్సు ప్రమాదంలో 19 మంది సజీవ దహనమైన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం తెల్లవారుజామున మూడు ట్రావెల్స్ బస్సులు ప్రమాదాలకు గురయ్యాయి. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం వద్ద అద్దంకి-నార్కట్‌పల్లి హైవేపై వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపుతప్పి ముందువెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాల య్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మిర్యాలగూడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా చెన్నే కొత్తపల్లి మండలం దామరాజు పల్లి దగ్గర జబ్బార్ ట్రావెల్స్ బస్సు ఓ ట్రక్కును ఢీ కొట్టింది. ఈ ఘటనలో బెంగుళూరుకు చెందిన ఓ మహిళ మరణించగా మరో 8 మంది గాయపడ్డారు. ఈ బస్సు బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తోంది. మృతురాలు బెంగళూరుకు చెందిన వారిగా గుర్తించారు. మరోవైపు.. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం జూబ్లీనగర్‌లో భారతి ట్రావెల్స్‌కి చెందిన బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదం లో ఒకరు మృతి చెందారు. పది మందికి గాయాలయ్యాయి. ఆయా ఘటనలపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే సోమవారం తెల్లవారు జామున చేవెళ్లలో జరిగిన ప్రమాదంలో 19మంది దుర్మరణం చెందారు. చేవెళ్లలో తెల్లవారక ముందే బస్సెక్కిన 19 మంది ప్ర యాణికుల బతుకులు తెల్లారేలోగా కానరానిలోకాలకు మరలిపోయాయి. గమ్యస్థానాలకు చేరుకోక ముందే తమ వారికి దూరమయ్యా రు. క్షేమంగా వెళ్లొచ్చని ఆర్టీసీ బస్సు ఎక్కిన వారికి కంకర టిప్పర్ రూపంలో మృత్యుశకటం ఎదురొచ్చి ప్రాణాలనే బలి తీసుకున్నది. నిద్రలో ఉన్నవారు కొందరు శాశ్వత నిద్రలోకి జారిపోయారు. కర్నూలు జిల్లా చిన్నటేకూరు సమీపంలో ట్రావెల్స్ బస్సు అగ్నిప్రమాదానికి గురై 19 మంది సజీవ దహన మైన ఘటనను మరువకముందే రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలోని మిర్జాగూడ గేట్ వద్ద సోమవారం తెల్లవారుజామున మరోఘోర రోడ్డు ప్రమా దం జరిగింది. తాండూరు నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును అతివేగంగా వచ్చిన కంకర టిప్పర్ బలంగా ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకున్నది. హైదరాబాద్– బీజాపూర్ హైవేపై చేవెళ్ల నుంచి వికారాబాద్‌కు కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ (టీజీ 06టీ3879) వాహనం ఎదురుగా అతి వేగంగా వచ్చి ఆర్టీసీ బస్సును ఢీకొట్టి, దానిపై పూర్తిగా ఒరిగిపోయింది.

# సంపాదకీయం

## టాలీవుడ్ లో రివ్యూ మాఫియా!

కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి.. కొన్ని నెలల పాటు కష్టపడిన సినిమాకు.. ఎవరో ఎక్కడో కూర్చొని.. దానికి నెగటివ్ లేబుల్ అంటించేసి.. ఇంటర్నెట్, వెబ్ సైట్లు, సోషల్ మీడియా ద్వారా స్ప్రెడ్ చేసి.. సినిమాని కిల్ చేస్తున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయ్. కే-ర్యాంప్ మూవీ ప్రొడ్యూసర్ రాజేశ్ దండా.. తన కే-ర్యాంప్ మూవీపై.. ఓ వర్గం ఫేక్ ప్రచారం చేస్తోందని.. ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వెబ్‌సైట్‌ని ఉద్దేశించి.. స్టేజీ మీదే ఆగ్రహంతో ఊగిపోయారు. సినిమాని తొక్కాలని చూస్తున్నారని.. ఇలాంటోళ్లని నడిరోడ్డు మీద ఉరి తీయాలని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మిత్రమండలి మూవీ నిర్మాత బన్నీవాసు. ఇటీవలే.. మిత్రమండలి మూవీ ఈవెంట్‌లో నిర్మాత బన్నీ వాసు చేసిన కామెంట్స్ కూడా వైరల్ అయ్యాయి. తనని తొక్కాలని చూస్తున్నారని.. వాళ్లెవరూ తన వెంట్రుక కూడా పీకలేరని వార్నింగ్ ఇచ్చారు. ఒక సినిమాని తొక్కేస్తే.. ఇంకో సినిమా ఆడుతుందనే భ్రమలు పనికిరావన్నారు. నాగవంశీ వెబ్ సైట్లు, సోషల్ మీడియా రివ్యూలపై రియాక్ట్. ఆ మధ్య ప్రొడ్యూసర్ నాగవంశీ కూడా ఈ వెబ్ సైట్లు, సోషల్ మీడియా రివ్యూలపై రియాక్ట్ అయ్యారు. ఈ రివ్యూలే.. సినిమా సక్సెస్, ఫెయిల్యూర్‌ని డిసైడ్ చేస్తున్నాయన్నారు. చివరికి.. బుక్ మై షో యాప్‌లో లైకులకు కూడా డబ్బులిస్తున్నామన్నారు. యూట్యూబ్‌లో ట్రైలర్లకు వ్యూస్ పెంచుతున్నామన్నారు. కొందరు రివ్యూయర్లని ఉద్దేశిస్తూ.. తన సినిమాకు ప్రమోషన్ చేయొద్దని, రివ్యూలు రాయొద్దని కోరారు. అప్పట్లో.. నాగవంశీ వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయ్. సినిమాకు పాజిటివ్ రివ్యూ చెప్పేందుకు డబ్బులు డిమాండ్. ఈ మధ్యకాలంలోనే.. ఓ యూట్యూబ్ రివ్యూయర్.. తమ సినిమాకు పాజిటివ్ రివ్యూ చెప్పేందుకు డబ్బులు డిమాండ్ చేశాడని.. వర్జిన్ బాయ్స్ మూవీ ప్రొడ్యూసర్ రాజా దారపునేని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రేక్షకులు ఇలాంటి రివ్యూలు నమ్మి మోసపోవద్దని సూచించారు. అప్పట్లో.. ఈ వ్యవహారం కూడా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఇలా.. ఈ ఏడాదిలో.. ఈ రివ్యూల టాపిక్.. ఫిల్మ్ ఇండస్ట్రీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా.. చిన్న సినిమాలు, కాస్త ఎక్కువ బడ్జెట్‌తో తీసిన సినిమాల విషయంలోనే ఇలా జరుగుతోంది. సినిమా రిలీజైన మొదటి రోజే వచ్చే రివ్యూలు, సోషల్ మీడియా, యూట్యూబర్లు, వెబ్ సైట్ రివ్యూలు.. ఆడియెన్స్‌ని బాగా ప్రభావితం చేస్తున్నాయనే ఆందోళన నిర్మాతలు వ్యక్తం చేస్తున్నారు. మంచి రివ్యూలు వస్తే.. మౌత్ టాక్ త్వరగా వ్యాపించి.. సినిమా కలెక్షన్స్ పెరిగే అవకాశం ఉంది. ఇదే సమయంలో.. నెగటివ్ రివ్యూలు వస్తే.. దాని ఎఫెక్ట్ భారీగా ఉంటుందని నిర్మాతలు చెబుతున్నారు. అది.. కలెక్షన్లను భారీగా దెబ్బతీసి, సినిమా ఫ్లాప్ అయి.. తామెంతో నష్టపోతున్నామని చెబుతున్నారు నిర్మాతలు. దీనిని అదునుగా చేసుకొని.. ఇండస్ట్రీలోనే కొందరు తమ సినిమాలను తొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని.. చిన్న నిర్మాతలు బహిరంగంగానే వేదికలపై తమ ఆక్రోశాన్ని వెళ్లగక్కుతున్నారు. దాంతో.. ఈ వ్యవహారం ఇప్పుడు టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా మారిపోయింది. ముఖ్యంగా కొన్ని వెబ్‌సైట్‌లు, యూట్యూబ్ ఛానెళ్లు.. సినిమాకు అనుకూలమైన రేటింగ్, రివ్యూ ఇచ్చేందుకు.. నిర్మాతల దగ్గర డబ్బులు డిమాండ్ చేస్తున్నారని.. బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. డిమాండ్ చేసినంత ఇవ్వకపోతే.. కావాలనే నెగటివ్ రివ్యూలు ఇస్తున్నారని తమ ఆక్రోశాన్ని వెళ్లగక్కుతున్నారు. ఇంకొందరు రివ్యూయర్లు.. సినిమా చూడకుండానే, పబ్లిసిటీ కోసం అతి చేసి.. తప్పుడు సమాచారం, అనవసరమైన విమర్శలతో రివ్యూలు ఇస్తున్నారని.. ఇది ఫిల్మ్ ఇండస్ట్రీకి ఎంతో నష్టం కలిగిస్తోందని.. నిర్మాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వెబ్ సైట్లు.. కేవలం చిన్న సినిమాలపైనే దృష్టి పెట్టి, పెద్ద సినిమాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని.. దీని వల్ల తమకెంతో అన్యాయం జరుగుతోందని వాపోతున్నారు. డబ్బు కోసం పాజిటివ్ రివ్యూలు ఇచ్చేందుకు, ఇవ్వకపోతే.. నెగటివ్ రివ్యూలతో సినిమా వసూళ్లను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్న వారిని.. రివ్యూ మాఫియాగా చెబుతున్నారు. బెదిరించి.. తమను బ్లాక్‌మెయిల్ చేసిన వారిపై కొందరు నిర్మాతలు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. ఏదేమైనా.. కొత్తగా రిలీజయ్యే సినిమా చూడాలా? వద్దా? అనే ఊగిసలాడే ఓ వర్గం ప్రేక్షకులపై మాత్రం.. ఈ రివ్యూల ఇంపాక్ట్ గట్టిగానే ఉందనేది మాత్రం వాస్తవం. అందువల్లే.. తాము నష్టపోతున్నామని చిన్న నిర్మాతలు ఇంత ఆవేదన వ్యక్తం చేస్తున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది.ఓ సినిమా హిట్ అవ్వాలన్నా.. ఫట్ అవ్వాలన్నా.. దానిని డిసైడ్ చేసేది.. పబ్లిక్ టాకే. అయితే.. ఇప్పుడు రివ్యూలు కూడా సినిమా ఫ్యూచర్‌ని డిసైడ్ చేస్తుండటమే ఇండస్ట్రీపై ఎఫెక్ట్ పడుతుందోనే చర్చ జరుగుతోంది. వెబ్‌సైట్స్, మీమ్స్, ట్రోల్స్, హ్యాష్ ట్యాగ్స్.. ఇలా ప్రతీది.. సినిమా రిజల్ట్‌పై ఎంతో కొంత ఇంపాక్ట్ చూపుతున్నాయ్. వాస్తవానికి.. ఒకప్పటితో పోలిస్తే.. ఆరేడు ఏళ్ల నుంచే.. ఈ రివ్యూ ట్రెండ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో.. సినిమా రివ్యూలు అంటే.. జస్ట్ ఓవర్సీస్ మార్కెట్ వరకే పరిమితమయ్యేవి. కానీ.. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో.. మూవీ రివ్యూలు, వెబ్‌సైట్లు, ట్రోలింగ్స్, మీమ్స్.. ఇలా అన్నీ ఓ మాఫియాలా క్రియేట్ చేయబడ్డాయి. కొత్తగా వచ్చిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, యూట్యూబ్ రివ్యూయర్లు, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్స్, మీమ్ పేజీలు.. ఇలా అంతా బ్లాక్ మెయిల్ చేసేదాకా వచ్చాయ్ పరిస్థితులు. వీళ్లలో.. కొందరిపై.. ఒకరిద్దరు నిర్మాతలు పోలీసు కేసులు కూడా పెట్టారు. అయోమయానికి గురిచేస్తున్న పీఆర్ టీమ్‌లు. నిజం చెప్పాలంటే.. ఇండస్ట్రీలో పక్క సినిమాలను తొక్కేసేందుకు ప్రయత్నిస్తున్నారనే అపవాదు ఎప్పటి నుంచో వినిపిస్తోంది. ప్రతివారం 4 నుంచి 6 సినిమాలు రిలీజవుతుంటాయ్. కొందరు ప్రొడ్యూసర్లు, హీరోలు.. తమ సొంత డిజిటల్ పీఆర్ సిస్టమ్‌తో.. ట్రైలర్లకు నెగటివ్ కామెంట్లు, డిస్ లైక్స్ లో రేటింగ్స్, బుక్ మై షో యాప్‌లో లైక్స్, రేటింగ్స్, ట్విట్టర్ హ్యాండిల్స్ ద్వారా నెగటివ్ క్యాంపెయిన్, పెయిడ్ హ్యాష్ ట్యాగ్స్ ట్రెండింగ్ లాంటివాటన్నింటికి.. డబ్బులిచ్చి మరీ పక్క సినిమాని తొక్కడం.. ఈ మధ్యకాలంలో ఇండస్ట్రీలో కామన్ అయిపోయిందనే చర్చ జరుగుతోంది. ఇంతేకాదు.. కొందరైతే ఫేక్ కలెక్షన్ పోస్టర్లు కూడా వేసి.. హీరో ఫ్యాన్స్‌ని, ప్రొడ్యూసర్లని, మూవీ టీమ్‌ని.. అయోమయానికి గురిచేస్తున్నారు. ఇదంతా.. కొన్ని పీఆర్ టీమ్‌లు ఆడుతున్న గేమే ఇదంతా అనే టాక్ వినిపిస్తోంది. కావాలనే.. ఇదంతా చేయిస్తున్నారని ప్రొడ్యూసర్లు అంటున్నారు. తమ సినిమాతో పాటు ఒకేవారం రిలీజయ్యే సినిమాని.. రేసులో లేకుండా చేసేందుకు.. అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. ఓ వెబ్‌సైట్‌లో.. సినిమా యాడ్ డిస్ ప్లే కావాలంటే.. 60 వేలు అని, సినిమా ప్రమోషన్ ఆర్టికల్ రాస్తే 20 వేలు అని, ప్రీమియర్ షోలకు వెళ్లి.. స్పెషల్ రివ్యూ రాస్తే.. లక్ష దాకా సమర్పించుకోవాలని చెబుతున్నారు నిర్మాతలు. సోషల్ మీడియాలో సినిమా రివ్యూ పోస్ట్ చేసేందుకు కూడా 25 వేలు తీసుకుంటున్నారట. ఫస్ట్ హాఫ్ రివ్యూకు 20 వేలు, సెకండాఫ్ రివ్యూ కాస్త ఆలస్యంగా ఇచ్చేందుకు 30 వేలు ఇస్తున్నారట. ఇవన్నీ కాకుండా.. ఆ వెబ్‌సైట్ యాజమాన్యానికి.. సినిమా నిర్మాత లక్ష రూపాయల కవర్ పంపించాల్సిన పరిస్థితి ఉందంటున్నారు. అయితే.. ప్రొడ్యూసర్లు కూడా ఈ ట్రెండ్‌ని ఎంకరేజ్ చేస్తున్నారు. రివ్యూలు చెప్పేవాళ్లు, రాసేవాళ్లు డిమాండ్ చేసినంత డబ్బులు ఇస్తున్నారు. మూడు రోజుల వరకు రివ్యూలు రాకుండా చూడాలనే ఆలోచన. ప్రతి ప్రొడ్యూసర్ తన సినిమా జనాల్లోకి వెళ్లాలనే ఉద్దేశంతో.. సొంతంగా ఎంతైనా ఖర్చు పెట్టేందుకు వెనుకాడటం లేదు. దీనిని అదునుగా చేసుకొని.. ప్రమోషన్ల పేరిట.. పీఆర్ టీమ్‌లు కూడా విచ్చలవిడిగా ఖర్చు పెట్టిస్తున్నాయనే చర్చ ఉంది. నిర్మాతలు కూడా ఈ విషయంలో ఏమీ ఆలోచించడం లేదు. సొంతంగా నిర్ణయం తీసుకొని.. లక్షలు ఖర్చు పెడుతున్నారు. కానీ.. రిజల్ట్ చూశాక దెబ్బ గట్టిగా పడుతోంది. దాంతో.. ఇబ్బందులు పడుతున్నారు. అయితే.. ఇండస్ట్రీలోని నిర్మాతలంతా.. ఒకే తాటి మీదకు వచ్చి.. ఓ నిర్ణయం తీసుకుంటే.. రివ్యూయర్లను కట్టడి చేయొచ్చంటున్నారు. గతంలో.. 3 రోజుల వరకు రివ్యూలు రాకుండా చూడాలని.. ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయించినప్పటికీ.. అది ఇప్పటికీ అమల్లోకి రాలేదు. దాంతో.. కోట్లు ఖర్చు పెట్టి.. ఏళ్లు కష్టపడి ఓ సినిమా తీస్తే.. 3 గంటల సినిమా చూసి.. 3 నిమిషాల్లో రివ్యూ రాసేసి.. సినిమాను చంపేస్తున్నారనే వాదన వినిపిస్తోంది.





# కొత్త లుక్ లో కవితక్క

**హైద్రాబాద్,తెలంగాణ దిశ :** త రాజకీయ కుంపటి పెట్టుకునేందుకు రెడీ అవుతున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత..జనం బాట పేరుతో జిల్లాల పర్యటన చేస్తున్నారు. ప్రతీ జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటిస్తూ సామాన్య జనాన్ని కలిసి వారి కష్టాలు తెలుసుకుంటూనే అక్కడ మేధావులతో ప్రత్యేకంగా సమావేశం అవుతున్నారు కవిత.అయితే జిల్లాల బాటలో కవిత లుక్ సమ్ థింగ్ స్పెషల్‌గా ఉండటం ఆసక్తికరంగా మారింది. జాగృతి జనం బాటలో పాల్గొంటున్న కవిత తన స్టైల్‌ను పూర్తిగా మార్చేసి న్యూలుక్‌లో కనిపిస్తున్నారు. ఆమె ప్రస్తుత కట్టు, బొట్టు శైలి..ఇలా అన్నింటిలో స్పష్టమైన ఛేంజ్ కనిపిస్తోంది. గతంలో కవిత ఎక్కడికెళ్లినా దర్పం, హంగు, ఆర్భాటం కనిపించేవి. కానీ ఇప్పుడు ఇవేవి లేకపోగా సింప్లిసిటీకి ప్రయారిటీ ఇస్తున్నారట. మొన్నటి వరకు ఖరీదైన చీరలు, చేతికి కాస్ట్లీ వాచ్, మ్యాచింగ్ కాస్మొటిక్స్..

ఇలా అన్నింట్లోనూ తనకంటూ ప్రత్యేకతను చాటుకునేవారు కవిత. ఓ సందర్భంలో తాను ధరించే వాచ్ ధర ఇరవై ఐదు లక్షలు ఉంటుందని కూడా కవిత చెప్పడం చర్చకు దారితీస్తోంది. ఇక ఖరీదైన పట్టు చీరలు, స్టైలిష్ చెప్పులు, విదేశాల నుంచి తెప్పించుకున్న కాస్మోటిక్స్..ఇలా ప్రతీది ప్రత్యేకంగా కనిపించేంది. ఒక రోజులో రెండు మూడు కార్యక్రమాల్లో పాల్గొనాల్సి వస్తే ఎప్పటికప్పుడు మేకోవర్ మార్చేసేవారు కవితఅయితే ఇప్పుడు కవిత లుక్‌లో మార్పు వచ్చింది. ఆమె జడ వేసే స్టైల్ నుంచి చెప్పుల వరకు అన్నింట్లోనూ కొట్టొచ్చినప్పుడు మార్పు కనిపిస్తోంది. పట్టు చీరలు ధరించే కవిత ఇప్పుడు చేనేత చీరలు కట్టుకుంటోంది. చేనేత చీరలు కడుతూ చేనేత కార్మికులకు మద్దతుగా నిలుస్తున్నట్లు సందేశం పంపిస్తున్నారట. ఇంతకు ముందున్న హెయిర్ స్టైల్ ను పూర్తిగా మార్చి పాత కాలం స్టైల్లో కొప్పు పెట్టుకుంటున్నారు కవిత.తెలంగాణ పల్లెటూరి సంస్కృతిలో కొప్పుకు ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకునే ఆమె కొప్పును ఎంచుకున్నారట. ఇక ఇంతకు ముందులాగా ఖరీదైన వాచీలు ధరించడం లేదావె. కేవలం మట్టి గాజులను వేసుకుంటోంది. కవిత బొట్టు పెట్టుకునే విధానంలోనూ మార్పు కనిపిస్తోంది. తెలుగుదనంతో పాటు నార్త్ స్టైల్‌లో బొట్టు పెట్టుకుంటున్నారామె. ఇలా తన లుక్‌నే మార్చేశారు కవిత. సింప్లిసిటీలోకి వచ్చేశారు. అంతేకాదు ఆమె నడక, ప్రజలకు అభివాదం చేసే విధానం కూడా పూర్తిగా మారింది. అయితే ప్రజలకు దగ్గరయ్యే ఉద్దేశంతోనే ఆమె శైలిని మార్చినట్లు టాక్.జాగృతి అధ్యక్షురాలు కవిత ఆహార్యంలో వచ్చిన మార్పు గురించి రాజకీయవర్గాలతో పాటు సామాన్య జనంలోనూ ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. త్వరలోనే రాజకీయ పార్టీ పెట్టబోతున్న కవిత..అందుకు తగ్గట్టుగా తనను తాను మార్చుకుంటున్నారని అంటున్నారు. అందుకోసం గతంలో పాలిటిక్స్‌లో సక్సెస్ అయిన మహిళా నాయకుల నడవడిక, వాళ్ల ఆహార్యాన్ని అనుసరించి కవిత ఇలా తన లుక్‌ను మార్చేశారట. కవిత లుక్ తమిళనాడులో పురచ్చి తలైవిగా గుర్తింపు పొందిన దివంగత ముఖ్యమంత్రి జయలలితను తలపిస్తుందన్న టాక్ వినిపిస్తోంది.అంతే కాకుండా సుష్మా స్వరాజ్, మమతా బెనర్జీ వంటి నేతలను గుర్తు చేస్తున్నారు.

రాజకీయాలలో దృష్టిపరమైన గుర్తింపు ఎంత ముఖ్యమో జయలలిత నిరూపించారు. ఆమె ప్రత్యేకమైన వస్త్రధారణ, బాడీ లాంగ్వేజ్, ధైర్యంగా మాట్లాడే ధోరణి ఆమెను పొలిటికల్ ఐకాన్‌గా మార్చాయి. జాగృతి జనం బాట యాత్రలో కవిత కట్టుబొట్టు,

పబ్లిక్ ఇంటరాక్షన్ స్టైల్‌ను గమనించినవారు..ఆమె జయలలిత ఆహార్యాన్ని రీక్రియేట్ చేస్తున్నారని భావిస్తున్నారు. కొత్త స్టైల్‌తో జనం గుండెల్లో బలమైన నాయకురాలిగా నిలిచిపోవాలనే ప్రయత్నం చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మహిళల్లో బలమైన సెంటిమెంట్‌ను క్రియేట్ చేయాలనే ఉద్దేశంతోనే కవిత కొత్త శైలిని ఎంచుకున్నారన్న టాక్ నడుస్తోంది.

# వైఫల్యం..!




శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోటు చేసుకున్న తొక్కిసలాట దుర్ఘటన మరోసారి నిర్వహణ, భద్రత వైఫల్యాలను ఎత్తిచూపింది. కార్తీక ఏకాదశి కావడంతో ఒకే రోజు వేలాదిగా సందర్శకులు పోటెత్తి తీవ్ర తోపులాట జరిగి తొమ్మిది మంది మృత్యువాత పడటం విషాదం కాగా మరణించిన వారిలో ఎనిమిది మంది మహిళలు, పదమూడేళ్ల బాలుడు ఉండటం విచారకరం. పాతిక మంది వరకు తీవ్ర గాయాలపాలై వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రధాని, గవర్నర్, సిఎం, ప్రముఖుల సంతాపం, సానుభూతి, సందర్శనలు, ఎక్స్‌గ్రేషియా ప్రకటనలు షరా మామూలే. ఆర్‌డిఒ ఆధ్వర్యంలో ముగ్గురు అధికారులతో విచారణ కమిటీ వేశారు. ఈ మధ్యనే వైకుంఠ ఏకాదశి దర్శన టిక్కెట్ల అమ్మకం సందర్భంగా తిరుపతిలో తొక్కిసలాటలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. సింహాచలం ఆలయంలో గోడ కూలి ఏడుగురు చనిపోయారు. వాటిపై దర్యాప్తులు ఇంకా ఒక కొలిక్కి రానేలేదు. అంతలోనే కాశీబుగ్గ ఘోరం సంభవించింది. దీనిపై దర్యాప్తు సైతం ప్రత్యేకంగా గతానుభవాలు తెలుపుతున్నాయి.


ఒక ప్రైవేటు వ్యక్తి చేపట్టిన కాశీబుగ్గ కోవెల నిర్మాణం అసంపూర్తిగా ఉండగానే నాలుగు మాసాల క్రితం ప్రారంభమైంది. సోషల్ మీడియాలో అమిత ప్రచారం కల్పించడంతో రోజుకు రెండు వేల మంది వరకు సందర్శకులు వస్తున్నారు. శనివారం మంచి రోజని, ఆ రోజు దేవుడిని దర్శించుకుంటే మోక్షం, ముక్తి, పుణ్యం లభిస్తాయంటూ ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టా వంటి మాధ్యమాల్లో కొంత మంది పనిగట్టుకొని మరీ వైరల్ చేయడంతో పదిహేను వేల మందికిపైన గుడికి వచ్చారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకొచ్చాక కొన్ని శక్తులు ఒక పథకం ప్రకారం మత మౌఢ్య భావజాలాన్ని ప్రచారం చేయడం ఎక్కువైంది. ఫలాన రోజు ఇన్ని గంటల ఇన్ని నిమిషాలకు ఈ కార్యం తలపెట్టాలని కొంత మంది ప్రవచనకారులు, విశ్లేషకులు తాడుబొంగరం లేని కథలు కాకరకాయలు వ్యాప్తి చేయడంతో జనం నిజమేననుకొని ఎగబడి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. గతంలో రాజమండ్రిలో గోదావరి పుష్కరాల తొలి రోజు తోపులాటలో ముప్పై మంది మరణించడానికి ఈ విధంగా సృష్టించిన ఫోబియా వ్యాప్తి ఒక కారణం. కాశీబుగ్గలోనూ ఇటువంటి ప్రచారమే అమాయ కులను బలితీసుకుంది. ఇలాంటి మూఢత్వ ప్రచారాన్ని ప్రభుత్వం నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిర్మాణం పూర్తికాని ఆలయానికి యాత్రికులను అనుమతించడం ప్రభుత్వ తప్పిదం. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ఆశా, అంగన్‌వాడీ, ఇతర చిరుద్యోగులు సమావేశం పెట్టుకుంటా మంటేనే పోలీసులు అనుమతి నిరాకరించి ఉక్కుపాదం మోపుతారు. అలాంటిది గుడికి వేలాది మంది పోటెత్తుతారని అంచనా ఎందుకు వేయలేకపోయారు? నిఘా, ఎఐ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఏమైనట్టు? కాశీబుగ్గ ఆలయం లోపల, వెలుపల పోలీస్ బందోబస్తు లేదు. ట్రాఫిక్ నియంత్రణ అసలే లేదు. బారికేడ్లు లేవు. ఒకటవ అంతస్థులో ఉన్న గుడికి వెళ్లడానికి, రావడానికి ఒకే ఒక్క ఇరుకు మెట్లదారే దిక్కు. రైలింగ్ వంటి నిర్మాణాలు చాలా బలహీనంగా ఉన్నాయి. ఇవేమీ ప్రభుత్వ, పోలీస్ దృష్టిలో లేవా? భారీ జన సమూహం గుమిగూడేందుకు ఆస్కారం ఉన్న ప్రార్థనా స్థలాల వంటి రద్దీ, సున్నిత ప్రదేశాల్లో భద్రత, నిర్వహణ చర్యలు ఏమేమి తీసుకోవాలో జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ, జాతీయ భవన నియమావళి మార్గదర్శకాలు ఉన్నాయి. 2011లో శబరిమల, 2024లో హత్రాస్ సహా పలు తొక్కిసలాటల విచారణలో లోపాలు బయటపడ్డాయి. దేశంలో చోటు చేసుకుంటున్న తొక్కిసలాటల్లో 80 శాతం మత కార్యక్రమాలు, తీర్థయాత్రలలోనే సంభవిస్తున్నాయి. వరుసగా మన రాష్ట్రంలోనూ ఇటువంటివి జరుగుతున్నాయి. జనం భారీగా చేరే ప్రదేశాల్లో ఎటువంటి చర్యలు చేపట్టాలో ప్రభుత్వం స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసీజర్‌ను రూపొందించి కఠినంగా అమలు చేసి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రజల ప్రాణ భద్రతకు బాధ్యత వహించాలి. కాశీబుగ్గ దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాలను, క్షతగాత్రులను ప్రభుత్వం ఇతోధికంగా ఆదుకోవాలి. బాధ్యులను శిక్షించాలి.

# పీడీఎస్ బియ్యం కనిపెట్టేలా మొబైల్ టెస్టింగ్ కిట్స్




**కాకినాడ,తెలంగాణ దిశ :** పీడీఎస్ బియ్యం మాఫియా అనగానే కాకినాడ పేరు ఠక్కున గుర్తుకు వస్తుంది.. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై అంతటిస్థాయి వివాదం కాకినాడ చుట్టూ ముసురుకుంది.. రాష్ట్రవ్యాప్తంగా అక్రమ పద్ధతిలో సేకరించిన పేదల బియ్యాన్ని చివరకు కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు తరలించి అక్రమ సొమ్మును ఆర్జిస్తున్నారన్న ఆరోపణలపై ఎన్నికలకు ముందు నుంచి పెద్ద దుమారమే రేగింది.. ఈనేపథ్యంలోనే ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పీడీఎస్ బియ్యం మాఫియా అంతుచూస్తామని కూడా వాగ్ధానాలు చేశారు... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెంటనే ఆదిశగా చర్యలు ప్రారంభించారు.. కూటమి ప్రభుత్వం వచ్చాక డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కళ్యాణ్ కాకినాడ పర్యటకు వచ్చి నేరుగా పోర్టుకు వెళ్లారు.. అక్కడ అక్రమంగా ఎగుమతి అవుతున్న పీడీఎస్ బియ్యం ను టన్నుల కొద్దీ గుర్తించి సీజ్ చేయించారు.. ఆతరువాత ఏపీ సివిల్ సప్లై మినిస్టర్ నాదెండ్ల మనోహర్ కూడా మరో రెండు సార్లు కాకినాడ పోర్టులో విస్తృతంగా తనిఖీలుచేసి టన్నుల కొద్దీ పీడీఎస్ బియ్యం సీజ్ చేయించారు.. కానీ చాలా వరకు అవి పీడీఎస్ బియ్యం అని నిరూపించలేని పరస్థితి తెలెత్తింది.. ఇదిలా ఉంటే కాకినాడ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెక్ పోస్టులకు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా ను అడ్డుకునేందుకు ప్రత్యేక విధివిధానాలు రూపొందించినప్పటికీ అవికూడా అనుకున్న స్థాయిలో ఫలితాలు ఇవ్వలేకపోయాయి.. కానీ యధారాజా తథా ప్రజా అన్న చందంగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా అనే నియంత్రణ కాలేని పరిస్థితి కనిపిస్తోంది..గత ప్రభుత్వం హయాంలో విచ్చలవిడిగా జరిగిన రేషన్ బియ్యం అక్రమ రవాణా కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా నియంత్రణ కాలేని పరిస్తితి కనిపిస్తోంది.. రేషన్ మాఫియాలో చాలా మంది పెద్దల హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి..ముఖ్యంగా తీర ప్రాంతాల్లో రేషన్ మాఫియా రెచ్చిపోతుందని, దీనికి అడ్డుకట్ట వేయాలంటే చాలా ఇబ్బందులు తప్పడం లేదని అధికారులు సైతం చేతులెత్తేసిన పరిస్తితి కనిపించింది.. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి రేషన్ మాఫియాని కట్టడి చేసేందుకు మంచి ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకున్నట్లయ్యింది.. రేషన్ బియ్యం పట్టుకున్నా, అవి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం అని అనుమానాలున్నా పీడీఎస్ బియ్యం అని రూఢీ చేయడానికి టెస్ట్ చేయడానికి ల్యాబ్ కి పంపి వారం రోజులు వెయిట్ చేయాల్సి వచ్చేది. తాజాగా ప్రభుత్వం ఒక మొబైల్ కిట్‌ను రూపకల్పన చేయించి పంపిణీకు సిద్ధం చేసింది. మొబైల్ కిట్ లో ఉండే కెమికల్ బాటిల్స్ రేషన్ బియ్యం లో వేసినప్పుడు పోషక విలువల కోసం రేషన్ బియ్యంలో కలుపుతున్న పోర్టిఫైడ్ రైస్ ఎరుపు రంగులోకి మారతాయి. వెంటనే అది అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం అని అర్థం క్లియర్‌కట్‌గా అర్థం అవుతుంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 700 కిట్లు, 33 మంది అదనపు సిబ్బందిని విశాఖపట్నం లో 3 చెక్ పోస్ట్ ల దగ్గర నియమించారు. అలాగే కాకినాడ లో కూడా సుమారు 700 కిట్లు అదనపు సిబ్బందిని నియమించినట్లు తెలుస్తోంది.. దీంతో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను చాలా సులభంగా గుర్తించి కట్టడి చేయడానికి వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. పీడీఎస్ బియ్యంలో పోషక విలువలు పెంచేవిధంగా ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా రేషన్ బియ్యంలో ఫోర్టిఫైడ్ బియ్యం కలపడం ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు రక్తహీనత, పోషకాహార లోపం సమస్యలను తగ్గించేందుకు ఈ ప్రక్రియను ప్రారంభించింది. వీటివల్ల ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 లాంటిముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి.. ఈ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రతీ క్వింటాల్ సాధారణ బియ్యానికి ఒక కిలో ఫోర్టిఫైడ్ రైస్ కర్నల్స్ కలుపుతున్నారు. 100 కిలోల బియ్యంలో అంటే ఒక శాతం వంతు ఫోర్టిఫైడ్ బియ్యం ఉంటుంది.. ఇప్పుడు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా విషయంలో పట్టించేందుకు ఈ ఫోర్టిఫైడ్ రైస్ ఉపయోగ పడుతున్నాయి..



# ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో ఏ ఆహారాలను తినాలి..?

## వేటిని తినకూడదు..?

మనం రోజూ ఉదయం వివిధ రకాల బ్రేక్‌ఫాస్ట్‌లను తింటుంటాం. కొందరు ఇడ్లీలను తింటే, ఇంకొందరు దోశ, ఇంకా కొందరు పూరీ, చపాతీ, ఉప్మా వంటి అల్పాహారాలను తింటుంటారు. ఇక ఉదయం అన్నం తినే వారు కూడా చాలా మందే ఉన్నారు. అయితే పోషకాహార నిపుణులు చెబుతున్న ప్రకారం ఉదయం మనం తీసుకునే ఆహారంలో అన్ని రకాల పోషకాలు ఉండేలా చూసుకోవాలి. దీంతో మనకు ఆ రోజుకు కావల్సిన పోషకాలు ఉదయం ఆహారం నుంచి లభించడమే కాదు, శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. దీంతో రోజంతటికీ కావల్సిన శక్తి లభిస్తుంది. నీరసం, అలసట రాకుండా ఉంటాయి. ఉత్సాహంగా ఉంటారు. ఉత్తేజంగా పనిచేస్తారు. ఈ క్రమంలోనే ఉదయం బ్రేక్ ఫాస్ట్‌లో ఎలాంటి ఆహారాలను తీసుకోవాలి, వేటిని తీసుకోకూడదు.. అన్న వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.

ఫైబర్, ప్రోటీన్లు ఉండేలా..: ఉదయం బ్రేక్ ఫాస్ట్‌లో సంక్లిష్టమైన కార్బొహైడ్రేట్లు ఉండే ఆహారాలను తింటే మంచిది. బ్రౌన్ బ్రెడ్, ఓట్స్, రాగులు, జొన్నలు వంటి చిరు ధాన్యాలతో చేసిన టిఫిన్లు, పోహా, పప్పు దినుసులతో తయారు చేసే ఇడ్లీ లేదా దోశ వంటివి, కినోవా వంటి ఆహారాలను తింటే మంచిది. ఇవి శరీరానికి శక్తిని, పోషణను అందిస్తాయి. శరీరం రోజంతా యాక్టివ్‌గా ఉండేలా చూస్తాయి. అలాగే ఉదయం అల్పాహారంలో ప్రోటీన్లు ఉండేలా కూడా చూసుకోవాలి. కోడిగుడ్లు, పనీర్, మొలకలు, పప్పు దినుసులు, పెరుగు, బాదం, పిస్తా, జీడిపప్పు, చియా సీడ్స్, అవిసె గింజలు, పల్లీలు వంటివి తింటే ప్రోటీన్లు లభిస్తాయి. ఇవి కండరాలను నిర్మించడమే కాదు, శరీరానికి కావల్సిన శక్తిని అందిస్తాయి. రోజంతా చురుగ్గా ఉండేలా చేస్తాయి. నీరసం, అలసట రానివ్వవు.

ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ముఖ్యమే..: అవకాడో, నట్స్, సీడ్స్, నెయ్యి, ఆరోగ్యవంతమైన నూనెలను కూడా ఉదయం తీసుకుంటే మంచిది. అలాగే అరటి పండ్లు, యాపిల్స్, బెర్రీలు, బొప్పాయి, పుచ్చకాయ వంటి పండ్లను మీరు తినే టిఫిన్‌లో చేర్చుకుని తింటే మంచిది. దీంతో పోషకాలను అమితంగా పొందవచ్చు. అలాగే క్యాల్షియం లభించేందుకు గాను ఉదయం పాలను తీసుకోవచ్చు. జంతు సంబంధ పాలు అంటే అలర్జీ ఉన్నవారు సోయా పాలు, బాదం పాలను తాగవచ్చు. ఇక బ్రేక్ ఫాస్ట్‌లో తీసుకోకూడని ఆహారాలు కూడా ఉన్నాయి. అవేమిటో ఇప్పుడు చూద్దాం. చక్కెర అధికంగా ఉండే ఆహారాలు, పేస్ట్రీలు, బేకరీ ఐటమ్స్, తీపి అధికంగా ఉండే పాన్ కేక్స్, వాఫెల్స్ వంటివి తినకూడదు.

ఇవి వద్దు..: ఉదయం టీ, కాఫీ తాగేవారు చక్కెర లేకుండా తాగితే మంచిది. లేదా బ్లాక్ టీ, బ్లాక్ కాఫీ, లెమన్ టీ సేవించవచ్చు. వీటిల్లోనూ చక్కెర కలపకుండా తాగాలి. కావాలంటే కాస్త నిమ్మరసం, తేనె కలిపి తాగవచ్చు. అలాగే ప్రాసెస్ చేయబడిన పండ్ల రసాలు, స్టోర్‌లలో కొనుగోలు చేసిన స్మూతీలు, చక్కెర ఎక్కువగా ఉండే పెరుగుకు సంబంధించిన ఆహారాలు, నూనె పదార్థాలు, వేపుళ్లు, రాత్రి మిగిలిన కూరలు, కొవ్వు ఆహారాలు, అన్నం వంటి వాటిని ఉదయం ఎట్టి పరిస్థితిలోనూ తినకూడదు. ఇవన్నీ అనారోగ్యాలను కలగజేస్తాయి. వ్యాధులకు మూల కారణం అవుతాయి. కనుక ఉదయం మీరు తినే ఆహారం ఆరోగ్యవంతమైనదిగా, పోషకాలను, శక్తిని అందించేదిగా ఉండాలి. అప్పుడు మీరు యాక్టివ్‌గా ఉండడమే కాదు, ఎలాంటి రోగాలు రాకుండా సురక్షితంగా ఉంటారు. ఆయుర్దాయం కూడా పెరుగుతుంది.

# పిల్లలతో ఇవి తాగించండి..



**వేసవిలో పిల్లలను హైడ్రేటెడ్‌గా ఉంచడం చాలా ముఖ్యం. శీతల పానీయాలకు బదులుగా, ఇంట్లో తయారుచేసిన పండ్ల రసాలను ఇవ్వాలి. వేసవిలో పిల్లలకు ఇవ్వడానికి అనువైన 4 ప్రత్యేక రకాల జ్యూస్‌లు ఉన్నాయి.**

నారింజ రసం : నారింజ రసంలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది పిల్లల రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. హైడ్రేటెడ్‌గా ఉంచడంలో కూడా దోహదపడుతుంది.

పుచ్చకాయ రసం : వేసవిలో పిల్లలకు పుచ్చకాయ రసం మంచి ఎంపిక. పుచ్చకాయలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది పిల్లలను హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. దీనితో పాటు, పుచ్చకాయ రసంలో విటమిన్ సి, లైకోపీన్ పుష్కలంగా ఉంటాయి. ఇవి పిల్లల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పుచ్చకాయ రసం పిల్లల కడుపును చల్లగా ఉంచుతుంది. పిల్లలు రోజంతా తాజాగా ఉంటారు.

బొప్పాయి రసం : బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయ పడుతుంది. దీనితో పాటు, బొప్పాయి రసంలో విటమిన్ సి, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి పిల్లల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. బొప్పాయి రసం తయారు చేసి పిల్లలకు ఉదయం, సాయంత్రం ఇవ్వవచ్చు.

ద్రాక్షపండు రసం : పిల్లలకు ద్రాక్ష రసం అంటే చాలా ఇష్టం. పిల్లలకు కూల్ డ్రింక్‌కు బదులుగా ద్రాక్ష రసం ఇవ్వొచ్చు. ద్రాక్షలో పొటాషియం, విటమిన్ సి ఉన్నాయి. ఇవి పిల్లల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. దీనితో పాటు ద్రాక్ష రసం హైడ్రేటెడ్‌గా ఉంచడంలో కూడా సహాయ పడుతుంది.



# వాటర్ యాపిల్స్‌ను అంత తేలిగ్గా తీసుకోకండి..

## వీటితో కలిగే లాభాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు..!

వాటర్ యాపిల్.. దీన్నే రోజ్ యాపిల్ లేదా వ్యాక్స్ యాపిల్ అని కూడా పిలుస్తారు. ఒకప్పుడు ఇవి కేవలం విదేశాల నుంచి మాత్రమే దిగుమతి అయ్యేవి. కానీ ఇప్పుడు మన దగ్గర కూడా ఈ పండ్లను పండిస్తున్నారు. వాటర్ యాపిల్ పేరుకు తగినట్లుగానే 90 శాతం మేర నీటిని కలిగి ఉంటుంది. ఇవి పండనప్పుడు ఆకుపచ్చగా, బాగా పండినవి పింక్ రంగులో ఉంటాయి. ఈ పండ్లు కాస్త చప్పగా ఉంటాయి. కానీ ఇవి అందించే ఆరోగ్య ప్రయోజనాలు అద్భుతమనే చెప్పాలి. వాటర్ యాపిల్స్‌ను తినడం వల్ల శరీరానికి నీరు లభించడమే కాదు, అనేక రకాల విటమిన్లు, మినరల్స్‌ను కూడా పొందవచ్చు. ఈ పండ్లలో అనేక యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇవి మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వాటర్ యాపిల్స్‌ను తినడం వల్ల శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. దీంతో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. వేసవి తాపం నుంచి ఉపశమనం లభిస్తుంది. శరీరంలోని వేడి తగ్గిపోతుంది.


**జీర్ణ వ్యవస్థకు..:** వాటర్ యాపిల్‌లో విటమిన్లు సి, ఎ, ఇ, బి1, బి2, బి3 సమృద్ధిగా ఉంటాయి. అలాగే పొటాషియం, క్యాల్షియం, మెగ్నిషియం, ఐరన్, జింక్, కాపర్, మాంగనీస్ కూడా అధికంగా లభిస్తాయి. వాటర్ యాపిల్స్‌లో ఉండే విటమిన్ సి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. ఇది తెల్ల రక్త కణాలు పెరిగేలా చేస్తుంది. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాలను తగ్గిస్తుంది. వాటర్ యాపిల్స్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్దకాన్ని తగ్గిస్తుంది. జీర్ణ వ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. ప్రీ బయోటిక్ ఆహారంగా ఈ పండ్లు పనిచేస్తాయి. పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉండేలా చూస్తాయి. దీంతో జీర్ణ వ్యవస్థలో ఆహారం కూడా సులభంగా కదులుతుంది. అలాగే మలబద్దకం నుంచి ఉపశమనం లభిస్తుంది.

**షుగర్ లెవల్స్ తగ్గేందుకు..:** డయాబెటిస్ ఉన్నవారికి వాటర్ యాపిల్స్ ఎంతో మేలు చేస్తాయి. వీటి గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల ఈ పండ్లను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు అంత త్వరగా పెరగవు. ఈ పండ్లలో ఉండే ఫైబర్ షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తుంది. అందువల్ల డయాబెటిస్ ఉన్నవారు తరచూ వాటర్ యాపిల్స్‌ను తింటే ఫలితం ఉంటుంది. అలాగే వాటర్ యాపిల్స్‌లో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కొవ్వు ఉండదు. సోడియం కూడా ఉండదు. ఫైబర్, పొటాషియం అధికంగా ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. బీపీని నియంత్రణలో ఉంచుతాయి. దీంతో గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. ముఖ్యంగా రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. హార్ట్ ఎటాక్‌లు రాకుండా నివారించవచ్చు. వాటర్ యాపిల్స్‌లో ఉండే నియాసిన్ కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించేందుకు పనిచేస్తుంది. అందువల్ల ఈ పండ్లను తింటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

**క్యాన్సర్ రాకుండా..:** వాటర్ యాపిల్స్ లో అధికంగా ఉండే విటమిన్లు సి, ఎ, ఫినోలిక్ సమ్మేళనాలు యాంటీ ఆక్సిడెంట్లలా పనిచేస్తాయి. ఇవి కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. వాటర్ యాపిల్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి చర్మానికి సూర్య కిరణాల వల్ల జరిగే నష్టాన్ని నివారిస్తాయి. కాలుష్య కారకాలు, ఫ్రీ ర్యాడికల్స్ వల్ల చర్మానికి కలిగే హాని తగ్గుతుంది. వాటర్ యాపిల్స్‌ను తినడం వల్ల ప్రారంభ దశలో ఉండే క్యాన్సర్‌ను సులభంగా తగ్గించవచ్చని పరిశోధకులు చేపట్టిన అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇలా వాటర్ యాపిల్స్‌ను తరచూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# లో బీపీ లోతుపాతులు

చాలామంది అధిక రక్తపోటు (హైపర్‌టెన్షన్)తో బాధపడుతుండటం తెలిసిన విషయమే. అయితే, కొంతమంది మాత్రం లో బీపీతో బాధపడుతుంటారు. దీన్ని వైద్య పరిభాషలో హైపోటెన్షన్ అంటారు. రక్త పీడనం స్థాయిలు సాధారణం కంటే తక్కువకు పడిపోయినప్పుడు ఈ స్థితి తలెత్తుతుంది. అంటే బీపీ 90/ 60 ఎంఎం హెచ్‌జీ కంటే తక్కువగా నమోదవుతుంది. లో బీపీ వివిధ కారణాల వల్ల తలెత్తు తుంది. డీహైడ్రేషన్, గుండె సమస్యలు, వాడుతున్న మందులు లాంటివి లో బీపీకి కొన్ని కారణాలు. కొన్ని లక్షణాలను గుర్తిస్తేలో బీపీని పసిగట్టవచ్చు.



అవేంటంటే తలతిప్పడం: లో బీపీకి చాలా సాధారణమైన సంకేతం తలతిప్పడం(కండ్లుతిరగడం) లేదాతల తేలిగ్గా ఉండటం.మరీ ముఖ్యం గా తొందరగా లేచే ప్రయత్నం చేసినప్పుడు ఇలా ఉంటుంది. రక్తపోటు స్థాయులు అకస్మాత్తుగా పడిపోవడంతో మెదడుకు రక్త ప్రసారం తగ్గిపోతుంది. దీంతో తల తిరిగినట్టుగా లేదా అస్థిరంగా అనిపిస్తుంది.

మసక మసగ్గా కనిపించడం: చూపు మసకగా, తెరలుగా కనిపించడం కూడా లో బీపీ సంకేతమే. రక్తపోటు అకస్మాత్తుగా పడిపోయినప్పుడు ఇలా జరుగుతుంది. మెదడులాగా కండ్లకు కూడా నిరంతరం రక్త సరఫరా జరుగుతూ ఉండాలి. అయితే, రక్తపోటు స్థాయులు పడిపోయినప్పుడు కండ్లు ఆక్సిజన్‌ను సరిపోయినంతగా స్వీకరించ లేవు. ఇది చూపునకు సంబంధించిన సమస్యలకు దారితీస్తుంది.


అలసట బలహీనత: లో బీపీ ఉన్నప్పుడు ఎడతెగని అలసట, కండరాల బలహీనత పీడిస్తాయి. రక్తపోటు స్థాయులు పడిపోవడంతో మన శరీరంలోని అవయవాలు, కండరాలు తగినంత ఆక్సిజన్‌ను, పోషకాలను గ్రహించలేవు. దీంతో అలసటగా, నిస్త్రాణగా అనిపిస్తుంది.


చల్లటి పాలిపోయిన చర్మం: రక్తపోటు పడిపోయినప్పుడు మన శరీరం మెదడు, గుండె లాంటి కీలకమైన అవయవాలకు రక్తాన్ని పంపించడం మీద దృష్టి సారిస్తుంది. ఇది చర్మం, చేతులు, కాళ్లు పాలిపోవడానికి, చల్లబడటానికి దారితీస్తుంది. చర్మం కూడా చెమటగా, జిగటగా తయారవుతుంది. శరీరం ఉష్ణోగ్రతను క్రమబద్ధం చేసే ప్రయత్నం చేస్తుంది కాబట్టి, ఇలా జరుగుతుంది.

గుండె కొట్టుకోవడం క్రమం తప్పడం: రక్తపోటు స్థాయులు పడిపోయినప్పుడు రక్త ప్రసారం సరిగ్గా జరగడానికి గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. ఇది గుండె కొట్టుకోవడాన్ని క్రమరహితంగా లేదంటే బాగా వేగంగా మారుస్తుంది. ఇది ఒక్కోసారి తక్కువ, మరీ తక్కువ శ్వాస (షాలో బ్రీతింగ్)తో కూడా జరగవచ్చు. బీపీ అంటే మన శరీరంలో ధమనుల్లో రక్తం ప్రవహించే పీడనం. గుండె కొట్టుకున్నప్పుడు రక్తం ధమనుల్లో చేరుతుంది. వీటి ద్వారా శరీరం అంతటికీ ప్రసారమవుతుంది. అయితే, మన రక్తపోటు అన్నివేళలా ఒకేలా ఉండదు. వయసు, మందులు తదితర కారణాల వల్ల అది మారుతూ ఉంటుంది. ఇక పైన వివరించిన లో బీపీ లక్షణాలను గుర్తించిన వెంటనే వైద్యుణ్ని సంప్రదించి, తగిన చికిత్స తీసుకోవాలి.

# ఎండలో పావుగంటైనా..

నమస్తే మేడం. వేసవిలో ఎండలు ఎక్కువగా ఉంటాయి కదా! ఇతర దేశాల్లాగే మనమూ ఈ సమయంలో శరీరానికి విటమిన్-డిని ఎక్కువగా అందించవచ్చా. అలా అయితే ఏ సమయంలో ఎండలో గడపాలి. దాన్ని శోషించుకునేందుకు ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుపగలరు. మనది సమశీతోష్ణ మండలం. చక్కగా సూర్యుడు ప్రతిరోజూ ఉదయించి ఎన్నో గంటలు ఉంటాడు. నిజానికి ఇలాంటి వాతావరణంలో విటమిన్-డి లోపం రాకూడదు. కానీ మనం కేవలం నీడ పట్టునే ఉండటం వల్ల ఈ సమస్య వస్తుంది. సహజంగా సూర్యకాంతి నేరుగా చర్మానికి తాకినప్పుడు శరీరంలో విటమిన్-డి ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఒక రోజులో కనీసం పావుగంట ఇలా శరీరం మీద ఎండ పడేలా చూసుకోవాలి. భారతదేశంలో ఉన్నవాళ్లకు ఏడాదంతా విటమిన్-డి వస్తుంది.





మంచు దేశాల్లోలాగా మనకు ఎండకాలంలో మాత్రమే ప్రత్యేకంగా ఇది అందుతుంది అన్నది ఏం ఉండదు. కాకపోతే వేసవిలో పగటి సమయం ఎక్కువగా ఉండటం వల్ల సాధారణం కన్నా ఎక్కువగా ఎండకు ఎక్స్‌పోజ్ అవుతాం. కాబట్టి ఈ సమయంలో విటమిన్ స్థాయులు పెరుగుతాయి. ఇక, వేసవిలో విటమిన్-డి కావాలనుకున్నప్పుడు ఉదయం ఆరున్నర ఏడు నుంచి తొమ్మిది గంటల మధ్య, సాయంకాలం అయిదు తర్వాత ఎండలో ఉండటం మంచిది. వేడి ఎక్కువ ఉన్న సమయంలో బయటికి వెళ్లకపోవడమే ఉత్తమం. లేకపోతే శరీరం డీ హైడ్రేషన్ బారినపడే ప్రమాదం ఉంటుంది. ఇక విటమిన్-డి శోషణలో చర్మపు రంగు అన్నది కూడా ముఖ్యమే. అంటే లేత రంగు చర్మ ఛాయ ఉన్నవాళ్లతో పోలిస్తే ముదురు రంగు చర్మం ఉన్నవాళ్లలో డి విటమిన్ శోషణకు ఎక్కువ సమయం పడుతుంది. అందుకే తెల్లవాళ్లతో పోలిస్తే మనలాంటి ఆసియా దేశాల వారు మరికాస్త ఎక్కువ సేపు ఎండలో గడపాలి. అలాగే విటమిన్-డి మన శరీరంలో సమృద్ధిగా తయారవ్వాలంటే పండ్లూ, ఆకుకూరలూ, మాంసకృత్తులూ కలగలిపిన సమతులాహారం తీసుకోవడం తప్పనిసరి.

## అన్నదాతలు నేల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

-నానో యూరియాతో బహు ప్రయోజనాలు

-యూరియా వద్దు నానో యూరియా ముద్దు

-మంథని వ్యవసాయ సహాయ సంచాలకులు అంజని మిశ్రా



**మంథని,తెలంగాణ దిశ :**మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అన్నదాతల్లో మార్పు రావాలని నేల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మంథని వ్యవసాయ సహాయ సంచాలకులు అంజని మిశ్రా పేర్కొన్నారు. ఏటా ఎరువుల వినియోగంతో అనర్థాలు పెరుగుతున్న తరుణంలో వాటిని నియంత్రానికి నానో యూరియాని వినియోగించాలని సూచించారు. ఒక బస్తా గుళికల యూరియాతో సమానంగా అర లీటరు నానో యూరియా పనిచేస్తుందమన్నారు. అర లీటర్ మన జిల్లా కలెక్టర్ శ్రద్ధతో 150 రూపాయలకు మాత్రమే తెప్పించడం జరుగుతుందన్నారు.

కాబట్టి నానో యూరియాతో బహు ప్రయోజనాలు నానో యూరియా ని అన్ని పంటలకి ఉపయోగించవచ్చని దీనివల్ల అన్నదాతలకి రవాణా నిల్వ ఖర్చులు తగ్గుతాయన్నారు. పొలాల్లో బస్తా గుళికల యూరియా వేస్తే అందులో 30 శాతాన్ని పంట గ్రహిస్తుంది నానో యూరియా ని ఇతర పురుగుమందులతో కలిపి కూడా పిచికారీ చేసుకోవచ్చు ఇది ఆకులపై పిచికారి చేయడం వల్ల యూరియా పోషకము 80 శాతం మొక్క గ్రహిస్తుందని దీంతో దిగుబడులు ఎక్కువగా వస్తాయని పేర్కొన్నారు.

దీనివల్ల రసాయన ఎరువుల వినియోగం తగ్గి వాయు నీటి నేల కాలుష్యం తగ్గుతుందన్నారు.యూరియా వద్దు నానో యూరియా ముద్దు అని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అన్నదాతల్లో మార్పు రావాలని నేల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఏడిఏ అంజని మిశ్రా తెలిపారు.

# ఆందోళనకరం



రాష్ట్రంలో ప్రతి ఏటా ఆత్మహత్యలు పెరుగుతుండటం తీవ్ర ఆందోళనకరం. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశ వ్యాప్తంగా జరుగుతున్న బలవన్మరణాల్లో ఐదుశాతం ఆంధ్రప్రదేశ్ నుండే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. 2014లో 6,101గా ఉన్న ఆత్మహత్యల సంఖ్య 2022 నాటికి 8,908కి పెరిగింది. 2014లో ప్రతి లక్షమంది జనాభాకు 12 ఆత్మహత్య రేటుగా ఉంటే 2022 లో అది 16.8కి పెరిగింది. విజయవాడలో ఒకే ఏడాదిలో 65 శాతం ఆత్యహత్యల పెరుగుదల నమోదు కాగా, విశాఖపట్నంలో 22 శాతం పెరుగుదల కనిపించింది.

మరొక అధ్యయనం ప్రకారం ప్రతి ఏడాది రోడ్ ప్రమాదాలతో సమానంగా ఆత్మహత్యలు కూడా జరుగుతున్నాయి. సమైక్యరాష్ట్ర విభజన ముందునాటితో పోలిస్తే ఆ తరువాతే రాష్ట్రంలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. 1996-2013మధ్య రోజుకి 20 మంది ఆత్మహత్యలు చేసుకోగా, విభజన తరువాత 2014-2021 మధ్య రోజుకి 41 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. పాలకులు చెప్పే మాటలు ఎలా ఉన్నప్పటికీ రాష్ట్రం ఏ దిశలో సాగుతుందో చెప్పడానికి ఈ గణాంకాలు ఒక నిదర్శనం. అధికారికంగా కుటుంబ సమస్యలు, వ్యాధులు, అప్పుల బాధలను ఆత్మహత్యలకు కారణలుగా చెబుతున్నప్పటికీ అసలు కారణం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే అని చెప్పకతప్పదు. సరళీకరణ ఆర్థిక విధానాల్లో భాగంగా పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, కార్పొరేట్ అనుకూల విధానాలు ప్రజల మీద పెనుభారాన్ని మోపుతున్నాయి. దీంతో కుటుంబాలు తీవ్ర స్థాయిలో ఒత్తిడికి గురవుతున్నాయి.

ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో దినసరి కూలీలు, రైతులు, నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో ఉన్నారు. 2022లో నమోదైన గణాంకాల ప్రకారమే మొత్తం ఆత్మహత్యల్లో మూడో వంతు ఆత్మహత్యలు రోజువారీ కూలీలవే. ఇది వారి ఆర్థిక అస్థిరత, సామాజిక భద్రతా లోపానికి నిదర్శనం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించడంలో ప్రభుత్వాల వైఫల్యం యువతపై ప్రభావం చూపుతోంది. అన్నదాతల పరిస్థితి కూడా ఇంతే! పంటలకు గిట్టుబాటుధర లేక, చేసిన అప్పులు తీర్చలేక రైతులు ప్రాణలు తీసుకుంటున్నారు. వివిధ నివేదికల ప్రకారం 2014లో రాష్ట్రంలో 233 మంది రైతులు ఆత్యహత్యలు చేసుకోగా, 2022 నాటికి ఆ సంఖ్య 524కు చేరింది. ఒకవైపు అప్పులు తీర్చలేక రైతులు ప్రాణాలు తీసుకుంటుంటే, జీవనోపాధి లేక దినకూలీలు ఆత్మహత్యల బాట పడుతున్నారు. విద్యార్థులది మరో విషాద గాథ. 2022 సంవత్సరంలో 575 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకోవడం విద్యా వ్యవస్థలోని క్రూరత్వానికి నిదర్శనం. కార్పొరేట్ విద్యాసంస్థలు ర్యాంకుల కోసం విద్యార్థులపై అమానుష ఒత్తిడి పెడుతున్నాయి. విద్యార్థులలో తీవ్రస్థాయిలో అలజడి చెలరేగినప్పుడు కంటితుడుపు మాటలు చెబుతున్న నేతలు ఆ తరువాత వాటిని విస్మరిస్తుండటం దీనికి కారణం. మత్తు పదార్థాలకు బానిసలైన వారు చేసుకుంటున్న ఆత్మహత్యలు కూడా భారీగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తుంది. ఇక 2022లో చోటుచేసుకున్న మొత్తం 8,908 ఆత్మహత్యల్లో 2,141 మహిళలవే! ఈ పరిస్థితి దేనికి నిదర్శనమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆత్మహత్యలు వ్యక్తిగత బలహీనతలు కావు. వాటిని ప్రభుత్వాల విధానాలు, సమాజ బలహీనతల ఫలితంగానే చూడాలి! ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాల పట్ల సానుభూతి చూపడం కన్నా ముందుగా ఆ పరిస్థితి రాకుండా చూడటం అవసరం. ప్రజల ప్రాణాలను కాపాడాలన్న చిత్తశుద్ధి నిజంగానే పాలకులకు ఉంటే ఆ దిశలో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి.

ముందుగా మానసిక, ఆరోగ్య వసతులను బలోపేతం చేయాలి. హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, వాటిపై విస్తృత ప్రచారం చేయాలి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సష్టించాలి. రైతులకు రుణ విముక్తి, ఉపాధి హామీ పనులకు నిధుల పెంపు, కార్మికులకు భద్రత, విద్యార్థులకు ఒత్తిడి రహిత విద్య అందుబాటులోకి తేవాలి. నిజానికి ఇవన్నీ ప్రజల హక్కులే. వాటిని సాధించుకోవడం కోసం సమాజంలోని అందరూ కలిసి కదలాలి. ప్రభుత్వంపై ఒత్తిడితీసుకువచ్చి వాటిని సాధించాలి. లేనిపక్షంలో బలవన్మరణాల జాబితా మరింతగా పెరగుతుంది!

## ఖమ్మంలో రోప్‌వే, తీగల వంతెన, రిటైనింగ్ వాల్స్

**ఖమ్మం,తెలంగాణ దిశ :** ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులు పట్టాలెక్కాయి. అయితే వేగం పుంజుకోకపోవడానికి కారణం.. భూసేకరణ సమస్య. ఈ ప్రాజెక్టులు ఖమ్మం జిల్లాకు వచ్చిన తర్వాతనే అక్కడ చుట్టుపక్కల ప్రాంతాల స్థలాలకు ధరలు విపరీతంగా పెరిగిపోయా యి. దీంతో నిర్మాణాలకు కావాల్సిన భూమిని ఇచ్చేందుకు యజమా నులు ఒప్పుకోవడం లేదు. ధరలు అధికంగా ఉండటంతో.. ప్రభుత్వానికి స్థలాలు అప్పగించేందుకు నిరాకరిస్తున్నారు. అయితే దీనిపై త్వరలోనే కదలికి వచ్చి.. ప్రాజెక్ట్ పనులు పూర్తి కానున్నాయి. ఖమ్మం జిల్లా కేంద్రంలో అభివృద్ధి పనులు ఊపందుకోవడంలో భూసేకరణ ప్రధాన సమస్యగా మారింది. భూముల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో నిర్వాసితులను ఒప్పించడం రెవెన్యూ అధికారులకు సవాల్‌గా మారింది. అభివృద్ధి ప్రాజెక్టులు సమయానికి పూర్తయ్యేలా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తున్నప్పటికీ.. భూసేకరణలో ఎదురయ్యే ప్రతిబంధకాలు వేగాన్ని తగ్గిస్తున్నాయి.ఖమ్మం ఖిల్లాలో రూ.29 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రోప్‌వే ప్రాజెక్ట్ మొదటి అడ్డంకిని అధిగమించింది. తొమ్మిది ఇళ్లకు పరిహారం అందించడంతో నిర్మాణం కోసం మార్గం సుగమమైంది. నాలుగు క్యాబిన్ల తయారీ, టవర్ల పనులు వర్క్‌షాప్‌లో జరుగుతున్నాయి. లోయర్, అప్పర్ స్టేషన్లు సిద్ధం చేస్తే 2026 ఆగస్టు నాటికి రోప్‌వే ప్రజలకు అందుబాటులోకి రానుంది.గతేడాది మున్నేరు నది ఉప్పొంగడంతో పరిసర ప్రాంతాలు మునిగిపోయాయి. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం రూ.690 కోట్లతో 17 కిలోమీటర్ల రిటైనింగ్ గోడలు నిర్మిస్తోంది. ఇందుకోసం 239 ఎకరాల భూమి అవసరం. ప్రభుత్వ భూమిపై కొంతమేర పనులు పూర్తవగా.. ప్రైవేటు భూమి సేకరణలో ఆటంకం తలెత్తింది.



అధికారులు 2026 జూన్ లోగా ఈ పనులు ముగించాలని నిర్ణయించారు.నగర శుద్ధి వ్యవస్థను బలోపేతం చేసేందుకు రూ.239 కోట్లతో భూగర్భ మురుగుకాల్వలు మరియు ఎస్టీపీలు నిర్మిస్తున్నారు. పుట్టకోటలో 9.50 ఎంఎల్‌డీ సామర్థ్యం గల ప్లాంట్‌కు సమస్యలు లేకపోవడంతో పనులు వేగంగా సాగుతున్నాయి. అయితే ధంసలాపురంలో ప్రైవేటు భూమి కారణంగా అడ్డంకులు ఎదురవుతున్నాయి.హైదరాబాద్ తరహాలో రూ.183 కోట్లతో ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతంలో తీగల వంతెన నిర్మాణం జరుగుతోంది. 167 సెగ్మెంట్లలో ఇప్పటివరకు 100 ఏర్పాటు చేశారు. వరదల కారణంగా కొన్ని పనులు ఆగిపోవడంతో ఆలస్యం ఏర్పడింది. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు సరిపోక, కాంట్రాక్టర్లు పనులు నెమ్మదిగా కొనసాగిస్తున్నారు. 2026 మార్చి నాటికి ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు, గృహ యజమానులకు ప్రత్యామ్నాయ స్థలాలను అందించేందుకు సర్కారు వెంచర్‌ను సిద్ధం చేస్తోంది. దీంతో భూసేకరణపై ఉన్న అభ్యంతరాలు తొలగి, పనులు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

## ఆటాడుకుంటున్న రుతుపవనాలు..

# అయితే కుండపోత.. లేదంటే కరవు!

**దేశంలో వింతగా మారిన రుతుపవనాల తీరు**

**వాతావరణ మార్పులు ఒక కోణం మాత్రమేనన్న నిపుణులు**

**పట్టణ ప్రణాళిక, డ్రైనేజీ లోపాలే వరదలకు కారణం**

**హిమాలయ రాష్ట్రాల్లో కుండపోత.. గంగా మైదానాల్లో కరవు**

**కాంక్రీట్ వినియోగంతో భూమిలోకి ఇంకని వర్షపు నీరు**

ఢిల్లీ,: దేశంలో ఈ ఏడాది రుతుపవనాల గమనం వింతగా ఉంది. దేశంలోని కొన్ని ప్రాంతాలు భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలం అవుతుంటే.. మరికొన్ని ప్రాంతాలు తీవ్ర వర్షాభావంతో అల్లాడుతున్నాయి. ఈ విపత్కర పరిస్థితులకు వాతావరణ మార్పులు మాత్రమే కారణం కాదని, మన పట్టణ ప్రణాళికల్లోని లోపాలే కీలక పాత్ర పోషిస్తున్నాయని ఐఐటీ భువనేశ్వర్ నిపుణులు చెబుతున్నారు. ఐఐటీ భువనేశ్వర్‌కు చెందిన స్కూల్ ఆఫ్ ఎర్త్, ఓషన్-క్లైమేట్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ సందీప్ పట్నాయక్ ఈ అంశంపై కీలక విషయాలు వెల్లడించారు. దేశంలో సంభవిస్తున్న విపత్తులకు వాతావరణ మార్పు అనేది ఒక కోణం మాత్రమేనని అన్నారు. నగరాల్లో సరైన ప్రణాళిక లేకపోవడం, డ్రైనేజీ వ్యవస్థలు సక్రమంగా పనిచేయకపోవడం, మితిమీరిన కాంక్రీట్ వాడకం వంటివి తీవ్ర పరిణామాలకు దారితీస్తున్నాయని వివరించారు. దీనివల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం లేక, నగరాలు తేలికగా ముంపునకు గురవుతున్నాయని ఆయన తెలిపారు.

ఈ ఏడాది రుతుపవనాల కాలంలో దేశవ్యాప్తంగా వర్షపాతంలో నాటకీయమైన మార్పులు కనిపించాయని పట్నాయక్ పేర్కొన్నారు. పాశ్చాత్య అవాంతరాల కారణంగా జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఉత్తరాఖండ్, బీహార్ రాష్ట్రాల్లో అయితే భారీ వరదలకు గ్రామాలు కొట్టుకుపోయి వందల మంది గల్లంతయ్యారు. దీనికి పూర్తి విరుద్ధంగా, గంగా మైదాన ప్రాంతాలు జూన్‌లో వర్షం లేక ఎండిపోగా, మధ్య భారతదేశం మాత్రం భారీ వర్షాలతో తడిసిముద్ద యింది. హిమాలయ ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతల కారణంగా నీరు ఎక్కువగా ఆవిరై, వాతావరణంలో తేమ పెరుగుతోందని పట్నాయక్ వివరించారు. దీనివల్ల మేఘాలు దట్టంగా మారి, బరువెక్కి కుండపోత వర్షాలుగా కురుస్తున్నాయని, ఇవే కొండచరియలు విరిగిపడటానికి కారణమవుతున్నాయని తెలిపారు. అదేవిధంగా, బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడన వ్యవస్థ, రుతుపవనాలు కలిసి పర్వత ప్రాంతాల్లో గాలుల దిశను మార్చివేస్తున్నాయని, ఈ కారణంగానే కేరళలో కొండచరియలు విరిగిపడి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆయన విశ్లేషించారు.

## కన్నడరాని ఆటోవాలాలకు కష్టాలు



బెంగలూరు, : ఇటీవల తెలంగాణలో మార్వాడీ గో బ్యాక్ అన్న నినాదాలు వినిపించాయి. బంద్‌లు జరిగాయి. తమ కిరాణా వ్యాపారాలకు వారు అడ్డు వస్తున్నారన్నకారణంగా స్థానిక వ్యాపారులు వ్యతిరేకతను చాటారు. అయితే పరిస్థితి సద్దుమణిగింది. కర్ణాటక ప్రజలకు తమ భాషతో పాటు- తమ సంస్కృతిపై ఉన్న ఎనలేని అభిమానం గురించి మనకు తెలిసిందే. దీనికి తోడు చాలా కాలం నుంచి స్థానిక ప్రజలకు ఉపాధి అనే మరో అంశం కూడా వారి మదిలో అలాగే నాటుకుపోయింది. పెద్ద ఉద్యోగం అయినా లేక చిన్న రోజువారీ పని అయినా తమ నేలపై తమ వారికే దక్కాలనే ఆలోచన చాలా మంది కన్నడిగుల్లో ఉంది. ఈ క్రమంలోనే తాజాగా బెంగళూరులో కొత్త నినాదం ఊపిరి పోసుకుంది. కన్నడ మాట్లాడని ఆటోవాలాలు అంటే వేరే ప్రాంతం నుంచి వచ్చి ఉపాధి పొందుతున్న వారిని టార్గెట్ చేస్తూ ఆటోల వెనుక స్టిక్కర్లు వెలియటంపై దుమారం కొనసాగుతోంది. అనధికారికంగా ఆటోలు నడుపుతున్న

**వారు ఇక్కడి నుంచి వెళ్లి పోవాలని ప్రకటనలు**

హిందీవాలాస్ గో బ్యాక్ అంటూ అందులో ఉంది. పర్మిట్లు-, పోలీస్ వెరిఫికేషన్, డిస్ ప్లే, బ్యాడ్జి, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు కూడా ఆటోలు నడుపుతున్నారంటూ అందులో ఉంది. బెంగళూరులోని కేఆర్ పురమ్, మహదేవ్‌పురా ప్రాంతాల్లో దాదాపు ఇలాంటి ఆటోల సంఖ్య 10 వేలకు పైనే ఉన్నాయని స్టిక్కర్లో ఉంది. సోషల్ మీడియాలో ఇది తెగ వైరల్ అవుతుండటంతో చాలా మంది తమ అభిప్రాయాన్ని పంచుకుంటు న్నారు. ఇలాంటి స్టిక్కర్లు చూడటం బాధగా ఉందని,

మరీ ఇంత విద్వేషం పనికిరాదంటూ నమ్మబెంగళూరు అనే అకౌంట్లో పోస్టుపై క్యాప్షన్ పెట్టబడింది. కొందరు యూజర్లు ఉపాధి కోసం వచ్చిన వ్యక్తులు స్థానిక బాషతో పాటు- కల్చర్ నేర్చుకుంటే సరిపోతుందని దీనికోసం ఇలా పోస్టర్లు వేసి మరీ రచ్చ చేయటం సరికాదని అంటున్నారు. మరో వ్యక్తి మాట్లాడుతూ అందరూ సొంత కార్లలో ప్రయాణం వల్ల ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయని, బెంగళూరులో ప్రజలు విచక్ష కోల్పోయి ప్రవర్తిస్తు న్నారన్నారు. జంతువులు కూడా మనుషుల కంటే మంచిగా కలిసి జీవిస్తున్నాయని రాసుకొచ్చారు.


మరొకరు ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలతో బెంగళూరు ప్రస్తుతం వివాదాలకు అడ్డాగా మారిందటూ పోస్ట్ చేశారు. మరొకరు బెంగళూరు ప్రత్యేక దేశంగా కొందరు ఫీలవుతున్నారని.. ఇతర ప్రాంతాల ప్రజలపై ఇలా విషం కక్కటం సరికాదంటూ పోస్ట్ పెట్టారు. బెంగళూరులో ఆటో డ్రైవర్లు మీటర్లు లేకుండా నడపటం అక్రమం కాదా అంటూ మరొకరు ప్రశ్నించారు. మొత్తంగా ప్రాంతీయవాదం వివిధ రకాల్లో పొచివుంది. దీనిని గుర్తించి ముందుకు సాగాల్సి ఉంది.

# అమ్మో..కేఎఫ్సీ నా..?



**నిజామాబాద్,తెలంగాణ దిశ :** ఫ్రైడ్ చికెన్ అంటే ఇష్టపడని వారు ఎవరుంటారు. కారంగా.. క్రిస్పీగా.. ఇంకొంచెం ఘాటుగా.. వేడివేడి చికెన్ ముక్కలను లొట్టలు వేసుకుంటూ తింటూ.. అందులోకి కూల్ డ్రింక్ తాగుతూ ఆస్వాదించేవారు చాలామంది ఉంటారు. సాయంత్రం సమయంలో చల్లగా ఉన్న వాతావరణాన్ని.. ఇలాంటి వేడి ఫుడ్ తింటూ చాలామంది ఆస్వాదిస్తూ ఉంటారు. అందువల్లే కేఎఫ్ సీ రెస్టారెంట్లు సాయంత్రం సమయంలో విపరీతమైన రద్దీగా ఉంటాయి. దీనికి తోడు కేఎఫ్ సీ లో వినియోగదారులు కోరుకున్నట్టుగా చికెన్ లో వెరైటీలు లభిస్తుంటాయి.. లెగ్ పీస్, జాయింట్ వింగ్స్, చెస్ట్ పీస్ లు.. ఇలా రకరకాల వెరైటీలు అందుబాటులో ఉంటాయి. ఈ తరహా చికెన్ తినడం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యులు చెబుతున్నప్పటికీ చాలామంది వినిపించుకోరు. పైగా లొట్టలు వేసుకుంటూ తింటారు.అనేక సందర్భాలలో అనేక సందర్భాలలో కేఎఫ్ సీ లో చికెన్ ఆరోగ్యానికి మంచిది కాదని.. అందులో హానికరమైన పదార్థాలు ఉన్నాయని మీడియాలో వార్తలు వచ్చినప్పటికీ చాలామంది పట్టించుకోరు. ఎక్కడో జరిగింది కదా.. ఇక్కడైతే కాదు కదా అని సర్ది చెప్పుకుంటారు. పైగా భారీ ఆర్డర్లు పెట్టి తమ కడుపును నింపుకుంటారు. చికెన్ మాత్రమే కాదు శీతల పానీయాలు కూడా విపరీతంగా తాగుతుంటారు. అందువల్లే మనదేశంలో కేఎఫ్ సీ రెస్టారెంట్లు విపరీతంగా ఉంటాయి. సినిమా థియేటర్లు.. పెద్దపెద్ద మాల్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కాలేజీలు ఉన్నచోట.. హాస్టల్స్ ఉన్నచోట కే ఎఫ్ సీ రెస్టారెంట్లకు కొదవ ఉండదు. ఓ నివేదిక ప్రకారం మనదేశంలో కే ఎఫ్ సీ ప్రతి ఏడాది వందల కోట్ల వ్యాపారం చేస్తూ ఉంటుంది. ఇంకా తన వ్యాపారాన్ని విస్తరిస్తూనే ఉంది. అయితే తాజాగా తెలంగాణ రాష్ట్రంలో కే ఎఫ్ సీ రెస్టారెంట్ కు సంబంధించి ఒక దారుణమైన నిజం వెలుగులోకి వచ్చింది.తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ నగరంలో వేణు మాల్ లో ఇటీవల కొందరు చికెన్ లెగ్ పీస్ ఆర్డర్ చేశారు. అది తింటూ ఉండగా కుళ్ళిపోయిన వాసన వచ్చింది. దీంతో ఒక కస్టమర్ వచ్చి నిర్వాహకులను నిలదీశాడు. దీంతో వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. దీనికి తోడు వింగ్స్ ఆర్డర్ పెట్టిన వ్యక్తికి కూడా ఇలాంటి అనుభవం ఎదురయింది. దీంతో అతడి కూడా నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. కస్టమర్లు ఇలా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ రెస్టారెంట్ నిర్వాహకులు మాత్రం నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. పైగా వెగిలిగా నవ్వారు. ఈ వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో సంచలనం సృష్టిస్తోంది.

# ఆదిలోనే అలర్ట్ అవ్వండి



మంచి మార్కులు సాధించాలి, క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం కొట్టాలి అని అందరూ చెబుతుంటారు. కానీ, ఆర్థిక విషయాల గురించి పిల్లలకు అవగాహన కల్పించరు. దీంతో మంచి కొలువు సాధించి.. రెండు చేతులా సంపాదిస్తున్నా%ొ% మనీ మేనేజ్‌మెంట్‌లో చాలామంది విఫలం అవుతుంటారు. అలా కావొద్దంటే.. ఆర్థిక అక్షరాస్యత తప్పనిసరి. ఈ టిప్స్ ఫాలో అయితే.. మీ కష్టార్జితం వృథాపోకుండా ఉంటుంది. డబ్బు మాత్రమే లక్ష్యం కాకూడదు. కానీ, అనుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు డబ్బు సాధనంగా పనిచేస్తుంది. అందువల్ల ఆఫీసుల్లో ఏవైనా బెనిఫిట్ ప్లాన్స్ ఆఫర్ చేస్తే, అందులో చేరి డబ్బును ఆదా చేసుకోవాలి. కచ్చితంగా ఆ పొదుపు మొత్తం పెద్ద అవసరానికి ఉపయోగపడుతుంది. ఉద్యోగంలో చేరిన తొలినాళ్లలోనే షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ గోల్స్ పెట్టుకోవాలి. కుటుంబంతో విహారం, కారు, బైకు కొనడం గ్రటా స్వల్పకాలిక లక్ష్యాలుగా భావించి అందుకు తగ్గ సేవింగ్స్ చేసుకోవాలి. ఇంటి నిర్మాణం, రిటైర్మెంట్ ప్లాన్ లాంటివి దీర్ఘకాలిక లక్ష్యాలుగా నిర్దేశించుకొని.. ప్రణాళిక మేరకు డబ్బులు కూడబెట్టాలి. మార్కెట్లో చాలామంది ఫైనాన్షియల్ అడ్వైజర్లు అందుబాటులో ఉన్నారు. వారిని సంప్రదించి వచ్చే జీతాన్ని ఎలా ఖర్చు చేయాలో ఒకసారి తెలుసుకోవడం మంచిది. దానివల్ల సంపాదన ప్రారంభమైన మొదట్లోనే ఫైనాన్షియల్ ప్లానింగ్ అలవాటవుతుంది. పెట్టుబడి, రాబడిపై చిన్నవయసులోనే అవగాహన వస్తుంది.

ఎప్పటికప్పుడు మార్కెట్లో వస్తున్న స్కామర్లపై ఒక కన్నేసి ఉంచాలి. ఎలాంటి బెట్టింగ్, ఈజీ మనీ అవకాశాల వైపు మళ్లకుండా జాగ్రత్తగా ఉండాలి. డబ్బు విషయంలో ఎంత బాధ్యతగా ఉంటే, భవిష్యత్తులో అంత ఆర్థిక క్రమశిక్షణ అలవడుతుంది.

# ఉల్లి కొనుగోలుకు ని'బంధనాలు'



**మార్క్‌ఫెడ్ ద్వారా మూడు రోజులే కొనుగోలు**
**తరువాత బోనస్ అంటూ ప్రకటన**
**ఇ-క్రాప్ సర్టిఫికెట్ ఉంటేనే డబ్బులు**
**ఆందోళనలో రైతులు**

**కర్నూలు,తెలంగాణ దిశ :** ఉల్లి కొనుగోళ్లలో నిబంధనలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మూడు రోజులే కొనుగోలు చేసింది. ఆ తర్వాత నుంచి వ్యాపారుల దాయాదాక్షిణ్యాలకే వదిలేసింది. క్వింటాలు ఉల్లిని రూ.1,200 కంటే తక్కువకు వ్యాపారులు కొంటే, ఆ వ్యత్యాసపు ధరను తర్వాత భర్తీ చేయనున్నట్టు ప్రకటించింది. మిర్చి విషయంలోనూ ప్రభుత్వం అప్పట్లో ఈ విధంగా హామీ ఇచ్చినా అమలు కాలేదు. అదే విధంగా ఉల్లి బోనస్‌కు సంబంధించి ఏడేళ్ల క్రితం బకాయిలు ఇప్పటికీ చెల్లింపు జరగలేదు. దీంతో, ప్రభుత్వం మాటలపై ఉల్లి రైతుల్లో సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో ఉల్లి సాధారణ సాగు 43,817 ఎకరాలు కాగా, ఈ ఏడాది 26,696 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఎకరం విస్తీర్ణంలో ఉల్లి సాగుకు రూ.1.50 లక్షల వరకూ ఖర్చవుతోంది. గతేడాది గరిష్టంగా క్వింటాలుకు రూ.3,989 రాగా, ఈ ఏడాది రూ.1,599 మాత్రమే వచ్చింది. గతేడాది కనిష్టంగా క్వింటాలుకు రూ.679 రాగా, ఈ ఏడాది రూ.501కి పడిపోయింది. దీంతో, రైతులు రోడ్డెక్కడంతో ప్రభుత్వం స్పందించి క్వింటాలు ఉల్లిని రూ.1200కు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించింది. ఈ ధర రైతులకు ఏ మాత్రమూ గిట్టుధర కావడం లేదు. ప్రభుత్వం ఈ నెల ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు మొత్తం 1,226 టన్నుల ఉల్లిని మాత్రమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసింది. నిల్వ చేసుకోవడానికి అవకాశం లేదనే సాకుతో నాల్గో తేదీ నుంచి కొనుగోలు నిలిపివేసింది. వ్యాపారులకే అమ్ముకోవాలని తేల్చి చెప్పింది.

# ట్రంప్ సుంకాలతో ఎదురుదెబ్బలు

## అమెరికన్ వ్యాపారవేత్తల ఆందోళన

వాషింగ్టన్: ఆదాయం పెంచుకోవడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇతర దేశాలపై కొరడా ఝులిపిస్తే.. ఆ దెబ్బ అమెరికా కంపెనీలకే తగులుతోంది. దీంతో అక్కడి వ్యాపార కంపెనీలు లబోదిబోమంటున్నాయి. ఇది అమెరికాకు మేలు చేసేదెల ఉన్నా, ముందుగా తమ ఉనికికే ప్రమాదంగా మారిందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. అగ్రరాజ్యానికి చెందిన మెజారిటీ- కంపెనీలు చైనా నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తుండటమే అందుకు కారణం. చైనా నుంచి అత్యధిక సుంకాలు వసూలు చేయాలని వాషింగ్టన్ భావించగా.. బీజింగ్ కూడా తాము తక్కువ తినలేదని ప్రతీకార సుంకాలు విధించింది. దీంతో అమెరికా కంపెనీలే ఎక్కువగా నష్టపోనున్నాయని షాంఘైలోని అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన సర్వేలో తేలింది. ఈ సర్వేలో మొత్తం 254 కంపెనీల్లో మూడోవంతు పాల్గొన్నాయి. చైనాలో కొత్త సుంకాల వల్ల తాము అంచనా వేసిన ఆదాయం తగ్గుతుందని అవి పేర్కొన్నాయి. అయితే, బ్యాంకింగ్, కొన్నిరకాల ఇతర పరిశ్రమలు అమెరికా(÷ూఅ)కు ఎటు-వంటి ఎగుమతులు, దిగుమతులు చేయడం లేదు. ఇలాంటి కంపెనీలు దాదాపు మూడింట ఒక వంతు ఉన్నాయని తెలిసింది. వీటిపై మాత్రమే టారిఫ్‌ల భారం ఉండదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనా దిగుమతులపై తొలుత అదనంగా 30 శాతం సుంకాలు విధించారు. తర్వాత వాటిని 145 శాతానికి పెంచారు. దీనిపై డ్రాగన్ కూడా దీటుగా స్పందించడంతో పరస్పర సుంకాలపై వెనక్కి తగ్గాలని ఇరు దేశాధినేతలు మేలో నిర్ణయించుకున్నారు. దీంతో చైనా 10 శాతం సుంకాలతో సరిపెట్టింది. నూతన టారిఫ్‌ల ప్రభావం చైనా నుంచి అమెరికాకు ఎగుమతులు చేసే కంపెనీలు, అగ్రరాజ్యం నుంచి కొన్ని రకాల ముడిసరకు దిగుమతి చేసుకొనే కంపెనీలపై పడింది. వీటిలో ముఖ్యంగా రసాయన కంపెనీలు ఉన్నాయని షాంఘై ఛాంబర్ లీడర్స్ తెలిపారు. సుంకాలు మా కార్యకలాపాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని ఆ బృంద అధ్యక్షుడు పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికా, చైనాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతు న్నాయి. సుంకాలు, ఇతర అంశాలపై ఏవిధంగా ముందుకెళ్తున్నారనే విషయంపై స్పష్టత రావడం లేదు. భవిష్యత్తు ప్రణాళికలు రూపొందిం చుకోవాల్సిన కంపెనీలకు ఈ అనిశ్చితి ఒక సవాలుగా మారిందని జెంగ్ వ్యాఖ్యానించారు. ఎమర్జెన్సీ చట్టాల ఆధారంగా సుంకాలు విధిస్తున్నారని, అవి చెల్లుబాటు కావని ఇప్పటికే పలు కోర్టులు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా తీర్పునిచ్చాయి. ఈ తీర్పులపై ట్రంప్ యంత్రాంగం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

### మెల్లగా స్వరం మారుస్తున్న ట్రంప్ భారత్‌తో సుంకాలపై చర్చిస్తామని సూచన

వాషింగ్టన్, : సుంకాలకు సంబంధించి ఇటీవలి వరకు భారత్‌పై ఘాటు- వ్యాఖ్యలు చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వరం రోజురోజుకు మారుతోంది. ఆయన మళ్లీ భారత్‌కు చేరువ కావాలని తపిస్తున్నారు. తాజాగా తన సోషల్ మీడియా 'ట్రూత్' వేదికగా మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా, భారత్ మధ్య వాణిజ్య అడ్డంకులను పరిష్కరించడానికి తన పరిపాలన విభాగం ఇండియాతో చర్చలు కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఈ అంశంపై తన మిత్రుడైన భారత ప్రధాని మోదీతో వచ్చే కొన్ని వారాల్లోనే మాట్లాడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు- తెలిపారు. ఈ చర్చలు రెండు గొప్పదేశాలకు మంచి ఫలితాలు ఇస్తాయని ఆశిస్తున్నట్లు- వెల్లడించారు.

రష్యా నుంచి అధికస్థాయిలో భారత్ చమురును దిగుమతి చేసుకొని విదేశాలకు అమ్ముతూ ఇటీవలి వరకు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సుకు ఇటీ-వల హాజరైన ప్రధాని మోదీ అక్కడ చైనా అధ్యక్షుడు అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ద్వైపాక్షిక భేటీ-లు నిర్వహించారు. ఈ భేటీ- అనంతరం చైనా చీకటి వలయంలో భారత్ చిక్కుకున్నట్లు- ట్రంప్ విమర్శలు గుప్పించారు. అనంతరం కొన్ని గంటల్లోనే తన స్వరం మార్చారు. భారత్, అమెరికా మధ్య బంధం చాలా ప్రత్యేకమైందని పేర్కొన్నారు. దాని గురించి ఆందోళన చెందనక్కర్లేదని తెలిపారు. ప్రధాని మోదీని ప్రశంసలతో ముంచెత్తారు. మోదీ గొప్ప ప్రధానమంత్రి అని కొనియాడారు. మోదీకి తానెప్పుడూ స్నేహితుడినన్నారు.

# జీవితం క్షణ భంగురం

**తిరుమల,తెలంగాణ దిశ :**మానవ జన్మ ఎక్కువ కాలం ఉండదు. ఈజీవితం బుద్బుదప్రాయం. ఉన్న కొద్ది కాలంలో మంచి అనిపించుకునేలా జీవించాలి. ఇలాంటి జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలి. ఆదర్శంగా జీవితం గడపాలి. ఉన్న కాలాన్ని సక్రమంగా వాడుకోవాలి. 'దుర్లభో మానుషోదేహః' శరీరం లభించడమే చాలా కష్టం, 'దేహినాం క్షణ భంగురః' లభించినది ఒక క్షణమంత కూడా ఉండదు. ఇది మెరుపు కంటే కూడా ప్రమాదకరమైనది. మెరుపు ఎట్లా ఐతే పోయేదో, ఆ వెలుతురును పట్టించుకోం, అట్లానే శరీరం పోయేది అని తెలిసి కూడా దానికోసం ఎన్ని తప్పుడు పనులు చేస్తున్నామో గుర్తించాలి. పోయేదే అయినా ఇది పోయేది అని అనుకోనివ్వటం లేదు. కేవలం శరీరంకోసం బ్రతుకుతున్నాం అంటే ఇది ఎంత ప్రమాదమైనదో గుర్తించాలి. మెరుపు పోతుందని తెలుసు మనం వాడుకోం, అందుకే ఆ మెరుపే నయం. ఇట్లాంటి స్థితిలో మనం ఎన్నో జన్మలలో ఒకసారి మనిషి అయినప్పుడు దైవాన్ని గురించి ఆలోచించి, ఆ జ్ఞానాన్ని ఇచ్చే మహానుభావులని విశ్వసించి వారికి తగినట్లు బ్రతికగలిగితే, అట్లాంటి జన్మ కోటికి ఒకటైనా ఉంటుందో లేదో అని చెప్పవచ్చు. 'తత్రాపి దుర్లభం మన్యే వైకుంఠ ప్రియదర్శనం' మానవ జన్మలభించడమే గొప్ప అంటే, అట్లాంటి మానవ జన్మలో దైవాన్ని గుర్తించి బ్రతకడం, వైకుంఠ ప్రియులైన వారి దర్శనం లభించడం, వారి అభిమానం పొందటం ఎంత కష్టమో అనేది ఋషివాక్కు!! పరాశర మహర్షి వంటి వారికే అట్లా అనిపిస్తే ఇక మన గురించి ఆలోచించాలి. ఇవన్నీ మనిషికి చెప్పాల్సొచ్చింది, అది చెప్పడానికే రామావతారం. పురాణాలు, ఇతిహాసాలు అన్నీ మానవుడు సన్మార్గంలో నడవడానికి ఉపయోగపడేవే. వాటిని చదివి ఆ మార్గంలో పయనించినప్పుడే మానవ జన్మకు సార్థకత ఉంటుంది. మన జీవితం సుఖమయంగా సాగుతుంది.

# నేపాల్‌లో చిక్కుకున్న భారత పర్యాటకులు

## పర్యాటకులను కూడా వదలని ఆందోళనకారులు

ఖాట్మండ్,: నేపాల్‌లో జెన్-జడ్ నిరసనలు హింసాత్మక పరిస్థితులను సృష్టించాయి. ప్రభుత్వ, ప్రైవేటు- ఆస్తులకు ఆందోళనకారులు నిప్పటించారు. పొఖారా ప్రాంతంలో ఉన్న హోటల్ పైనా వారు దాడికి దిగారు. దాంతో అందులో బస చేస్తోన్న భారత పర్యాటకురాలు ఉపాసన గిల్ తనకు సహాయం చేయాలంటూ భారత ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. దానికి సంబంధించిన వీడియో ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. ఉపాసన గిల్ వాలీబాల్ లీగ్ కోసం నేపాల్ వచ్చారు. నిరసనలతో పొఖారా ప్రాంతంలో ఉన్న హోటల్‌లో చిక్కుకుపోయాను. తొలుత నేను బస చేసిన హోటల్‌కు నిప్పంటించారు. నా వస్తువులన్నీ అందులోనే ఉండిపోయాయి. దాడి సమయంలో నేను స్పాలో ఉన్నాను. కొందరు నిరసనకారులు పెద్దపెద్ద కర్రలతో నా వెనకే దూసుకొచ్చారని గిల్ వాపోయారు. వారినుంచి ఎలాగోలా ప్రాణాలు కాపాడుకున్న ఆమె.. సహాయం కోసం భారత ప్రభుత్వాన్ని అర్థించారు. ప్రస్తుతం పరిస్థితులు ఏమాత్రం బాగా లేవని, రోడ్డుపై ఎక్కడ చూసినా మంటలే కనిపిస్తున్నాయని వెల్లడించారు. వారు పర్యాటకులను కూడా వదలడం లేదు. ఎలాంటి ఆలోచన లేకుండా ప్రతిదీ తగలబెడుతున్నారు. పరిస్థితి ఎలా ఉంటుందో తెలియడం లేదు. నాతోపాటు- చాలామంది సహాయం కోసం ఎదురుచూస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఇక ఇప్పటికే నేపాల్ లో ఉన్న భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు భారత ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అక్కడి రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్లను వెల్లడించింది. అలాగే పరిస్థితులు చక్కబడేవరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించింది. ప్రస్తుతం ఉన్నచోటే ఉండాలని, వీధుల్లోకి రావొద్దని హెచ్చరించింది. ఎప్పటికప్పుడు స్థానిక యంత్రాంగం ఇచ్చే సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. నేపాల్ సరిహద్దుల్లో ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని సొనౌలీ ప్రాంతం మీదుగా భారతీయ పర్యాటకులు తిరిగి స్వదేశానికి వస్తున్నారు. అక్కడ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వారంతా తమ పర్యటనను అర్ధంతరంగా ముగించుకొన్నారు. ఇదిలాఉంటే.. చర్చల ద్వారా శాంతియుత పరిష్కారానికి కృషి చేయాలని అధ్యక్షుడు, ఆర్మీ నిరసనకారులను కోరింది. ప్రస్తుతం అక్కడ ఆర్మీ కర్ఫ్యూ ప్రకటించింది. నేపాల్ వెంబడి ఉన్న సరిహద్దు ప్రాంతాల్లో భారత్ భద్రతను కట్టుదిట్టం చేసింది

# ప్రపంచానికే ఆదర్శం




సర్వమానవ సంక్షేమమే లక్ష్యంగా సాగిపోతున్న కేరళ జనాభా సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రపంచానికే ఆదర్శంగా నిలవడం ముదావహం. దేశమంటే మట్టికాదోరు.. దేశమంటే మనుషులోరు%ొ% అన్న మహాకవి గురజాడ మాటలను ఆచరణలో పెట్టేందుకు మార్క్సిస్టు యోధుడు ఇఎంఎస్ నంబూద్రిపాద్ మొదలు.. అచ్యుతానందన్, పినరయి విజయన్ వరకూ%ొ% లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వాలు సాగించిన కృషి%ొ% నేడు కేరళ మోడల్‌గా ప్రశంసలందుకుంటోంది. ప్రపంచంలోనే అత్యధిక జనాభాతో.. అందునా యువత అత్యధికంగా ఉండటం దేశ అభివృద్ధికి తోడ్పడేదే! ఈ అవకాశాన్ని మానవ సంక్షేమానికి, దేశ సౌభాగ్యానికి ఎలా వినియోగించవచ్చో కేరళ నిరూపిస్తోంది. అత్యధిక జనాభా కంటే విద్య, వైద్య నైపుణ్యాలున్న యువతే ఆస్తి అని చాటిచెప్పింది. ప్రపంచంలోనే అతి తక్కువ శిశు మరణాలు నమోదులో%ొ% అత్యంత అభివృద్ధి చెందిన అమెరికాను అధిగమించడం కేరళ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. శాంపుల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్) నివేదిక ప్రకారం మనదేశంలో ప్రతి వెయ్యి శిశు జననాలకు శిశు మరణాల రేటు (ఐఎంఆర్) 25గా ఉంది. ప్రపంచంలోనే అత్యాధునిక వైద్య సదుపాయాలున్న అమెరికాలో 5.6 శాతం శిశు మరణాలు నమోదవుతుంటే, కేరళలో ఐదు శాతమే నమోదవుతున్నాయి. నవజాత శిశువుల మరణాల రేటు (నియోనేటల్ మోర్టాలిటీ) దేశ సగటు 18 శాతం కాగా, కేరళలో 4 శాతం కంటే తక్కువ. రాష్ట్ర అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతూ, నిధుల విడుదలకు మోకాలడ్డుతున్న మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని సవాలు చేస్తూనే.. ఈ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లోని కార్పొరేట్, ప్రైవేటు వైద్యరంగం అందించే సేవలను అధిగమించడం హర్షనీయం. దేశంలోనే అత్యధికంగా 37 శాతం శిశు మరణాలు బిజెపి పాలిత మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో నమోదయ్యాయి. మోడీ ప్రభుత్వం అత్యధిక నిధులు కట్టబెడుతున్నా%ొ% బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆరోగ్యం అథమంగానే ఉంటోంది. నీతి ఆయోగ్ నివేదికల ప్రకారమే 2019- 20 నుంచి అన్ని ఆరోగ్య సూచీలలో కేరళ దేశంలో అగ్రస్థానంలో ఉంది. అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా లేదా అంతకంటే ఎక్కువగా ఉంది.

కేరళ సగటు ఆయుర్దాయం 77 కాగా, ప్రపంచ సగటు 73.5. కేరళలో ప్రసవ సమయాలలో మరణాల రేటు లక్షకు 46 మాత్రమే. జాతీయ సగటు 97. 2018లో నిఫా వ్యాప్తిని 10 రోజుల్లోనే రాష్ట్రప్రభుత్వం నియంత్రించగలిగింది. కరోనాను నియంత్రించడంలో మోడీ ప్రభుత్వం మొదలు, బిజెపి పాలిత రాష్ట్రాలన్నీ చేతులెత్తేయగా, కేరళ ప్రభుత్వం, అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి శైలజ టీచర్ చేసిన అవిరళ కృషిని ఐక్యరాజ్యసమితి ప్రత్యేకంగా అభినందించింది. 2021, 2022లో సంతానోత్పత్తి రేటు (టిఎఫ్ఆర్) దేశంలో 2 శాతంగా ఉండగా, 2023లో 1.9 శాతానికి తగ్గింది. జననాలు, మరణాలు ఒకదానికి ఒకటి సమతుల్యం చేసుకుంటే జనాభా స్థిరత్వం ఏర్పడుతుంది. ప్రస్తుతం యువ జనాభా అత్యధికంగా ఉన్న దేశాల్లో మనదేశం ముందుంది. ఆరోగ్యకరమైన, చదువుకున్న, నైపుణ్యం కలిగిన జనాభా నుంచే డెమోగ్రాఫిక్ డివిడెండ్ (జనాభా లాభం) లభిస్తుందని, యువజనాభా ఉత్పాదక శక్తిగా ఆవిర్భవిస్తుందని కేరళ మోడల్ నిరూపించింది. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాలు%ొ% భూపంపిణీ, అధునాతన విద్య, వైద్యరంగం, మానవాభివృద్ధి కోసం పడిన తపన నేడు సత్ఫలితాలనిస్తోంది. మహిళలు, పిల్లలపై కేంద్రీకరణ%ొ% ప్రజల సామర్థ్యాన్ని విపరీతంగా పెంచింది. ఇటీవల డిజిటల్ లిటరసీని సైతం సాధించి దేశానికి, ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచింది. ప్రజల కోసం అధికారాన్ని వెచ్చిస్తే, స్థానిక సంస్థలకు అధికారాలిస్తే సాకారమయ్యే అద్భుతాలను ఆవిష్కృతం చేసి, దేశానికే రోల్ మోడల్‌గా ఆవిర్భవించింది. విద్య, వైద్యరంగంలో అద్భుతాలతో 16 శాతంగా పెరిగిన వృద్ధ జనాభా సంక్షేమం కోసం ఈ ఏడాది ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ కమిషన్, కేరళ రాష్ట్ర వృద్ధుల విధానం దేశానికి దిశానిర్దేశం చేసేవే.

కేరళలాంటి రాష్ట్రాలకు అవసరమైన నిధులివ్వాల్సిన కేంద్రం%ొ% గవర్నర్లు, జిఎస్‌టి నిధులను తొక్కిపెట్టడం తదితర రూపాల్లో అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడటం క్షమార్హం కాదు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు, మతాల మధ్య, కులాల మధ్య కుంపట్లు పెట్టడం, మణిపూర్ మాదిరిగా మంటలు రేపడం దేశ సర్వతోముఖాభివృద్ధికి ఆటంకం. కేరళ మోడల్‌ను అనుసరించే విధానాలను రూపొందించడం, తగిన వనరులను వినియోగించడం దేశ సర్వతోముఖాభివృద్ధికి అత్యవసరం.

# యూరియా కోసం రైతుకు తప్పని నిరీక్షణ..

**రాజంపేట,తెలంగాణ దిశ :** యూరియా కోసం రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. ఉదయం 5 గంటల నుండి సొసైటీల ముందు రైతులు.. క్యూలైన్లో చెప్పులను పెట్టి ఏడు ఎనిమిది గంటలు లైన్లో నిరీక్షణ చేసినా రైతుకు ఫలితం దక్కడం లేదు. వచ్చే కొద్దిపాటి యూరియా కోసం వారు బారులు తీరడంతో అధికారులు పోలీసుల సహాయంతో రైతుకు ఒక బస్తా చొప్పున యూరియా పంపిణీ చేయడం జరుగుతు ంది. వచ్చిన యూరియా అందరికీ సరిపోక రైతులు వెను తిరగాల్సి వస్తుంది. అదే పరిస్థితి ప్రస్తుతం రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో ఎదురైంది. వచ్చిన లారీని అడ్డుకొని రైతులు తమకు సరిపడ్డ యూరియా అందటం లేదని నిరసన వ్యక్తం చేశారు. సుమారు 1000 మంది రైతులు క్యూ లైన్‌లో వేచి ఉంటే కేవలం రెండు వందల బస్తాల యూరియా రావడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. పంటలకు సరైన సమయంలో యూరియా అందక పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు వాపోతున్నారు. ఒక్క బస్తా యూరియా కోసం ఏడు ఎనిమిది గంటలు లైన్లో వేచి చూస్తే అప్పుడు యూరియా దొరుకుతుందని రైతులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని వేడుకుంటున్నారు.



# అమెరికాకు 62 వేల కోట్ల నష్టం


## ఒడిదుడుకుల్లో ఆర్థికం

న్యూయార్క్ : ఏ ముహూర్తంలో ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాడో తెలియదు గాని.. ఆ దేశానికి ఏది కూడా కలిసి రావడం లేదు. ఆంక్షలు.. సుంకాలు.. ప్రపంచ దేశాలను అనేక విధాలుగా ఇబ్బంది పెడుతున్నాడు ట్రంప్. ఒక రకంగా ప్రత్యక్ష నరకం అంటే ఏమిటో చూపిస్తున్నాడు. వాస్తవానికి ట్రంప్ విధిస్తున్న సుంకాలవల్ల ప్రపంచ దేశాల కంటే అమెరికాకే నష్టం ఎక్కువగా జరుగుతోంది. ఈ విషయాన్ని ట్రంప్ గుర్తించడం లేదు. ఏమాత్రం లెక్కలోకి తీసుకోవడం లేదు.ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు ప్రపంచ దేశాలను ఇబ్బంది పెడుతోంది. అమెరికాలోని విపక్ష పార్టీల నేతలు కూడా ట్రంప్ తీరు పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా అమెరికాలో కీలక బిల్లుల విషయంలో విపక్ష పార్టీ నిరసన వ్యక్తం చేసింది. బిల్లుల విషయంలో అధికార పార్టీ తీసుకొచ్చిన విధానాలకు వ్యతిరేకంగా స్వరం వినిపించింది. దీంతో అమెరికా ప్రభుత్వం ప్రస్తుతం షట్ డౌన్ అనే పరిస్థితిని ఎదుర్కొంటున్నది. గడిచిన 31 రోజులుగా అమెరికా ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. దీనివల్ల అమెరికాలో ఏకంగా 62,000 కోట్ల సంపద ఆవిరి అయిపోయింది.పరిస్థితి ఇలాగే కొనసాగితే 11 బిలియన్ డాలర్ల సంపద ఆవిరి అయిపోతుందని కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ పేర్కొంది. ఈ షట్ డౌన్ చాప కింద నీరు లాగా విస్తరిస్తోందని ఆర్థిక రంగ నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలహీనంగా



మారిపోవడం వల్లే ఇదంతా జరుగుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ఇది ఊహించిన దానికంటే అతిపెద్ద సమస్యగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలో 1981 నుంచి షట్ డౌన్ అనేది కొనసాగుతూ వస్తోంది. అమెరికా ప్రభుత్వం ఇప్పటివరకు 10 సార్లు మూతపడింది. అమెరికాలో ట్రంప్ అధ్యక్షుడైన తర్వాత 2018 –19 కాలంలో దాదాపు 35 రోజుల పాటు ప్రభుత్వం మూతపడింది. అమెరికా దేశ చరిత్రలోనే అతిపెద్ద సుదీర్ఘమైన మూసివేత అని అక్కడి నిపుణులు చెబుతున్నారు. ఇక ప్రస్తుతం చట్టసభ సభ్యుల మధ్య ఏమాత్రం రాజ కుదరడం లేదు. ఈ ప్రకారం తీసుకుంటే గత రికార్డును ఈసారి చోటు చేసుకున్న షట్ డౌన్ బద్దలు కొడుతున్న అనే అనుమానాలు వ్యక్తంఅవుతున్నాయి. ఇప్పటికే అమెరికా జాబ్ మార్కెట్ చాలా బలహీనంగా ఉంది. షట్ డౌన్ ప్రభావం జాబ్ మార్కెట్ మీద తీవ్రతగా అనిపిస్తోంది. ఆర్థిక విధానాలు ఏమాత్రం బాగోలేదు.

# చెదలకు చెక్,,!



వానలతోపాటే చెదపురుగులూ విజృంభిస్తాయి. తలుపులు, కిటికీలతోపాటు చెక్క ఫర్నిచర్‌పై దాడిచేస్తాయి. లక్షల్లోనే నష్టం కలిగిస్తాయి. కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తే.. చెదపురుగులకు ఇట్టే చెక్ పెట్టొచ్చు! వర్షాకాలంలో తలుపులు, కిటికీలను ఎప్పుడూ మూసి ఉంచుతారు. దాంతో ఇంట్లో తేమ పేరుకుపోయి.. చెదపురుగుల బెడద పెరుగుతుంది. వీటిని నివారించడానికి ఇంట్లోకి గాలి ప్రసరణ బాగుండేలా చూసుకోవాలి. చెక్క ఫర్నిచర్‌ను గోడలకు కొంచెం దూరంలో ఉంచాలి. ఒక స్ప్రే బాటిల్‌లో వెనిగర్ తీసుకొని.. దానికి నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమంతో చెదలు పట్టిన చోట స్ప్రే చేస్తే.. ఘాటు వాసనకు చెదపురుగులు చనిపోతాయి. చెదపురుగులను తరిమేయడంలో వేపనూనె అత్యంత ప్రభావం చూపుతుంది. తలుపులు, కిటికీలు, చెక్క ఫర్నిచర్‌పై వేపనూనెను అప్లయి చేయాలి. వేప నూనెలోని ఘాటైన వాసనకు చెదపురుగులు తోకముడుస్తాయి. దీనిలోని ఔషధ గుణాలు.. అవి మళ్లీ మీ ఇంటివైపు చూడకుండా చేస్తాయి.

అలోవెరా జెల్ కూడా చెదపురుగులను నాశనం చేస్తుంది. అవి ఎక్కువగా ఉండే ప్రాంతంలో అలోవెరా జెల్ రాస్తే.. ఊపిరాడక చనిపోతాయి. లవంగాల నూనెలో క్రిమినాశక లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. చెక్క ఉత్పత్తులపై లవంగాల నూనెను అప్లయి చేస్తే.. చెదపురుగులు పారిపోతాయి. ఒక లీటర్ నీటిలో కొద్దిగా పటిక కలిపి.. ఆనీటితో చెదలు పట్టినచోట పిచికారీ చేయాలి. లేదా పసుపు పొడిని చల్లినా.. చెదల బెడద తగ్గుతుంది. ఒక స్ప్రే బాటిల్‌లో నీరు తీసుకొని.. ఒక టీ స్పూన్ ఉప్పు కలపాలి. ఈ మిశ్రమాన్ని చెదపురుగులపై స్ప్రే చేస్తే.. చెదపురుగులు డీహైడ్రేషన్‌కు గురవుతాయి. కొద్దిరోజులకే చనిపోతాయి.

# హెచ్ ఐ వి / ఎయిడ్స్ పై అవగాహనే ఆయుధం

### ఎయిడ్స్ అంటు వ్యాధి కాదు అంటించుకునే వ్యాధి

### ఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

**గోదావరిఖని,తెలంగాణ దిశ :**గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో హెచ్.ఐ.వి/ ఎయిడ్స వ్యాప్తిని నిరోధించడంలో భాగంగా కళాశాల ఎన్. ఎస్. ఎస్ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్ మరియు ఐ.సి.టీ. సి. సంయుక్తంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమా నికి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జై కిషన్ ఓఝా అధ్యక్షత వహించగా, ఐ. సి.టీ. సి. కౌన్సిలర్ శంకర్ రిసోర్స్ పర్సన్ గా విచ్చేసి హెచ్ ఐ వి / ఎయిడ్స్ మహమ్మారి బారిన పడకుండా నివారణోపాయాలు తెలియజేసి అవగాహన కల్పించారు. వీరు మాట్లాడుతూ – ముఖ్యంగా యువత మంచి జీవన శైలిని అలవరుచుకొని ఆరోగ్యవంతమైన జీవన విధానం పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. డిస్పోసబుల్ సిరంజిలు వాడడం ద్వారా, అపరిచితుల నుండి రక్తాన్ని స్వీకరించకపోవడం వలన అనగా రక్త మార్పిడి సమయంలో జాగ్రత్త వహించడం వలన, అనారక్షిత సంభోగ క్రియకు దూరంగా ఉండడం వలన, ఎయిడ్స్ సోకిన గర్భిణీ స్త్రీ కి జన్మించిన శిశువులకు హెచ్. ఐ. వి సోకకుండ ఎన్ వి పి ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా హెచ్. ఐ./ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా నివారించవచ్చన్నారు. విద్యార్థులుదీని బారిన పడకుండా తమని తాము రక్షించుకోవచ్చని చెప్పారు. ఎయిడ్స్ అనేది అంటూ వ్యాధి కాదని అంటించుకునే వ్యాధని తెలుసుకొని బాధితుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని కోరారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారిని ప్రభుత్వం వారు నిర్వహించే ఐ.సి.టీ.సి.లకు సమాచారం అందించి హెచ్. ఐ.వి ఎయిడ్స్ పీడితుల ను కౌన్సెలింగ్ లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం వారు అందించే తగిన సూచనలు పొంది ఉచితంగా అందించే



మందులు క్రమం తప్పకుండా వాడుకోవాలన్నారు. యువత నిశ్శబ్దాన్ని ఛేదించి హెచ్. ఐ. వి ఎయిడ్స నివారణ గురించి చర్చించాలి అన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య జై కిషన్ ఓఝా మాట్లాడుతూ–విద్యార్థులు ఎన్. ఎస్. ఎస్ వాలంటీర్లు హెచ్. ఐ.వి/ ఎయిడ్స భూతాన్ని తరిమి కొట్టాలన్నారు. ఈ మహమ్మారికి మందు లేదని నివారణ ఒక్కటే మార్గమని అవగాహన కలిగి ఉండా లన్నారు. ఎయిడ్స వ్యాధిగ్రస్తుల పట్ల సానుకూల దృక్పథం పెంపొంది ంచుకోవాలన్నారు. . రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ మరియు ఎన్. ఎస్. ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా డికిరణ్మయి సభకు ఆహ్వానం పలికి సదస్సును నిర్వహించారు. ఎయిడ్స వ్యాప్తి నిరోధం పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సహించిన ప్రిన్సిపల్ ప్రొ జై కిషన్ ఓఝా కి, ఐ. సి. టీ. సి కౌన్సిలర్ శ్రీ శంకర్ కి కృతజ్ఞతలు తెలియజేసారు. ఎయిడ్స నివారణ పై అవగాహన కల్పించే కొన్ని నినాదాలనువిద్యార్థులతో పలికించారు. ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్ డా ఎం నరేష్ వాలంటీర్లకు సూచనలు, సలహాలు అందజేసి సభకు వందన సమర్పణ చేశారు. ఈ అవగాహన సదస్సులో వైస్ ప్రిన్సిపల్ మరియు ఎన్. ఎస్. ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ ఏ సాంబశివ రావు, ఎన్.ఎస్.ఎస్వాలంటీర్లు,హెల్త్ కేర్ మేనేజ్మెంట్విద్యార్థులు పాల్గొన్నారు.

# దెబ్బకు నలుగురు ప్రధానులు ఔట్!

ముంబై: నేపాల్‌లో సామాన్యుల ఆందోళనలు దేశం మొత్తాన్ని అల్లాడించాయి. యువతరం ఆవేశముందు.. కాకలు తీరిన రాజకీయ నాయకుల ఎత్తులు చిత్తయ్యాయి. అయితే, కేవలం నేపాల్ మాత్రమే కాదు, ఫ్రాన్స్, జపాన్, థాయ్‌లాండ్ వంటి దేశాల్లోనూ ఇదే పరిస్థితి. అయితే, రెండు రోజుల వ్యవధిలోనే నాలుగు దేశాలకు చెందిన ప్రధాన మంత్రులు పదవీచ్యుతులయ్యారు. కానీ, దీనికి కారణం చంద్రగ్రహణం అంటూ సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్ట్ ప్రస్తుతం తెగ వైరల్ అవుతోంది.ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతోన్న రాజకీయ పరిణామాలు ఆసక్తి రేపుతున్నాయి. సోషల్ మీడియాపై నిషేధం విధిస్తూ నేపాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చివరకు ఆ దేశాన్ని కుదిపేస్తోంది. ఆ దేశ ప్రధాన మంత్రి కేపీ శర్మ ఓలీ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. మరోవైపు, ఫ్రాన్స్‌లోనూ 'బ్లాక్ ఎవ్విరిథింగ్' ఉద్యమం క్రమంగా ఉధృతమవుతోంది. ఆ దేశ ప్రధాని ఫ్రాంకోయిస్ బేరోపై విపక్షాలు తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మా నం నెగ్గడంతో ఆయన సోమవారం నాడుపదవి నుంచి తప్పుకు న్నారు. ఇక, థాయ్‌లాండ్, జపాన్ ప్రధానులు షిన్‌వత్రా, షిగేరు ఇషిబాలు కూడా రాజీనామాలు చేశారు. జపాన్ పార్లమెంట్ ఎన్నికల్లో అధికార కూటమి ఓటమి చవిచూసి బలం కోల్పోయింది. దీంతో ఇషిబా రాజీనామా చేయాలనే ఒత్తిడి సొంత పార్టీ నుంచే ఎదురవ వడంతో ఆయన తప్పుకున్నారు. రెండు రోజుల వ్యవధిలోనే నాలుగు దేశాల ప్రధానులు రాజీనామా చేయడంతో ఇదంతా ఆదివారం నాడు సంభవించిన చంద్రగ్రహణం ప్రభావం అని సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తున్నారు.ప్రముఖ వ్యాపారవేత్త హర్షగోయెంకా ఎక్స్ (ట్విట్టర్)లో పెట్టిన ఓ పోస్ట్ చర్చనీయాంశమైంది. 'చంద్రగ్రహణం ప్రభావంతో గత రెండు రోజుల్లోనే జపాన్, ఫ్రాన్స్, నేపాల్, థాయ్‌లాం డ్ ప్రధానులను జనం ఇంటికి సాగనంపారు.. అందరి చూపు త్వర లోనే ఏర్పడబోయే సూర్యగ్రహణం మీదే ఉంది.. తదుపరి రాజీనామా ఓ పెద్ద కాషాయ నేతదే కావచ్చు' అనిఅంటూ ట్వీట్ చేశారు. ఆయన చేసిన ట్వీట్ పరోక్షంగా ప్రధాని మోదీని టార్గెట్ చేసినట్టు ఉంది. ఈ ట్విట్‌పై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. ఓ నెటిజన్ "ఆ వ్యక్తి మోదీ కావచ్చు" అని రిప్లయ్ ఇచ్చాడు.' అప్పటివరకు అందరూచేదు "ఆకుపచ్చ" రసాన్ని తాగి, తీపి నారింజ రసం అమృతాన్ని తాగాలనే ఆశతో సూర్యుడిని పూజిస్తారు.. తర్వాత జై శ్రీరామ్ అంటారు" అని ఓ నెటిజన్ కామెంట్ పెట్టారు.

# తమిళనాడులో రూ.1000 కోట్ల పైగా సైబర్ మోసాలు



ఢిల్లీ:తమిళనాడులో 2025 సంవత్సరంలో ఇప్పటివరకు రూ.1,100 కోట్ల నష్టం వాటిల్లిన సైబర్ మోసాలకు సంబంధించి లక్షకు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయని నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్సీఆర్పి) తెలిపింది. సైబర్ నేరస్థులు ఫిషింగ్ ఇమెయిల్‌లు, నకిలీ వెబ్‌సైట్‌లు లేదా హానికరమైన అటాచ్‌మెంట్‌లు వంటి మోసపూరిత వ్యూహాలను ఉపయోగించి ప్రజలను మోసం చేశారు. భారీ రాబడి వస్తుందని నమ్మబలికి నకిలీ ఆన్‌లైన్ లింక్‌లను క్లిక్ చేయించి భారీ స్కాములకు పాల్పడ్డారు. అందిన అనేక ఫిర్యాదులలో పెట్టుబడి స్కామ్‌లు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు ఉన్నాయి. 2024లో ఎన్సీఆర్పి పోర్టల్‌లో 1,27,041 ఫిర్యాదులు నమోదయ్యాయి. అందులో 13,287 పెట్టుబడి స్కామ్‌లు కాగా, 4,439 డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లుగా నివేదించబడ్డాయి. రూ. 1,673 కోట్లు నష్టపోయారని, అందులో రూ. 772 కోట్లు స్తంభింపజేసి, రూ. 84 కోట్లు బాధితులకు తిరిగి ఇచ్చామని సైబర్ క్రైమ్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సందీప్ మిట్టల్ తెలిపారు. ఈ సంవత్సరం జూలై వరకు రూ.1,010 కోట్ల నష్టం జరిగినట్లు నివేదించబడింది. అందులో రూ.314 కోట్లు స్తంభింపజేయబడ్డాయి. అవసరమైన కోర్టు ఆదేశాలు పొందిన తర్వాత రూ.62.4కోట్లు బాధితులకు తిరిగి ఇవ్వబడ్డాయి. తమిళనాడు సైబర్‌క్రైమ్ వింగ్ ప్రయత్నాల కారణంగా, మద్రాస్ హైకోర్టు అన్ని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లకు సర్క్యులర్ జారీ చేసిందని, స్తంభింపచేసినడబ్బును బాధితులకు తిరిగి ఇవ్వడానికి ఎఫ్ఐఆర్ లు నమోదు చేయమని పట్టుబట్టవద్దని ఆదేశిస్తూ మిట్టల్ చెప్పారు.

# 'తిరిగి వెళ్లిపోండి'.. బ్రిటన్‌లో భారతీయుల భవిష్యత్తు ప్రశ్నార్థకం..!



యుకె : విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో, భారతీయులు వీసా దరఖాస్తుల ఆలస్యం, వీసా తిరస్కరణ, వీసా రద్దు, వీసా ఫార్మాలిటీల కోసం స్వదేశానికి తిరిగి వెళ్ళాల్సిన అవసరం వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా, అమెరికాలో నాన్–ఇమ్మిగ్రెంట్ వీసాల కోసం థర్డ్ కంట్రీ వీసా ఆప్షన్ రద్దు కావడంతో, వీసా ఇంటర్వ్యూల కోసం భారతీయులు స్వదేశానికి తిరిగి వెళ్లాల్సి వస్తోంది,

ఇది వీసా ఆలస్యాలకు దారితీస్తోంది. విద్యార్థులు వీసాలు రద్దు అయినప్పుడు బహిష్కరణకు గురి కావడం లేదా చదువును కొనసాగించలేకపోవడం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

బ్రిటన్ లో తిరిగి వెళ్లనివారిపై ఉక్కుపాదం: బ్రిటన్‌లో నివసిస్తున్న వేలాది మంది భారతీయుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతోంది. వీసా గడువు ముగిసినప్పటికీ తమ దేశాలకు తిరిగి వెళ్లని వారిని వెనక్కి తీసుకునే విషయంలో సహకరించని దేశాలపై ఉక్కుపాదం మోపాలని యుకె ప్రభుత్వం నిర్ణయించింది. ఈ జాబితాలో భారత్, పాకిస్థాన్, నైజీరియాలు ఉండటంతో, ఆయా దేశాల పౌరులకు వీసాలు జారీ చేయడంలో కఠిన ఆంక్షలు విధించనున్నట్లు బ్రిటన్‌కు కాబోయే హెూం సెక్రటరీ (లేబర్ పార్టీ షాడో హెూం సెక్రటరీ) యెవెట్ కూపర్ ఉద్ఘాటించి గట్టిగా హెచ్చరించారు.

వీసా విధానమే బేరసారాల అస్త్రంగా: అక్రమ వలసదారులను నియంత్రించడంలో భాగంగా బ్రిటన్ ప్రభుత్వం 'రిటర్న్స్' ఒప్పందాలను (తిరిగి పంపించే ఒప్పందాలు) కఠినంగా అమలు చేయాలని భావిస్తోంది. ఈ ఒప్పందాల ప్రకారం %ా% వీసా గడువు ముగిసినా లేదా చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించిన తమ పౌరులను ఆయా దేశాలు తిరిగి వెనక్కి తీసుకోవాలి. అయితే, ఈ ప్రక్రియలో కొన్ని దేశాలు సహకరించడం లేదని బ్రిటన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో వీసా విధానాన్ని ఒక 'బేరసారాల అస్త్రంగా' వాడుకోవాలని కొత్త ప్రభుత్వం ఆలోచిస్తోంది.

ఆలస్యం చేస్తే : ఒకవేళ భారత్ వంటి దేశాలు తమ పౌరులను వెనక్కి తీసుకోవడంలో ఆలస్యం చేస్తే ముందుగా వీసా దరఖాస్తు రుసుములను భారీగా పెంచాలని, వీసా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయాలని, చివరి అస్త్రంగా ఆ దేశ పౌరులకు తాత్కాలికంగా లేదా పూర్తిగా వీసాలను నిలిపివేయాలని బ్రిటన్ ఆలోచిస్తోంది.

అత్యధికులు భారతీయులే: బ్రిటన్ హెూం ఆఫీస్ గణాంకాల ప్రకారం %ా%. వీసా గడువు ముగిసినా బ్రిటన్ దేశంలోనే ఉండిపోయినవారిలో భారతీయులే అత్యధిక సంఖ్యలో ఉన్నారు. 2020 నాటికే దాదాపు 20,706 మంది భారతీయులు ఈ జాబితాలో ఉన్నట్లు అంచనా. గత ఏడాది భారత్ సుమారు 7,400 మందిని వెనక్కి తీసుకున్నప్పటికీ, పాస్‌పోర్టులు లేనివారిని గుర్తించి, వారికి అత్యవసర ప్రయాణ పత్రాలు జారీ చేయడంలో భారత ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని యూకే అధికారులు ఆరోపిస్తున్నారు. బ్రిటన్ ఏకపక్షంగా తీసుకునే ఈ నిర్ణయం భారత్ వంటి కీలక భాగస్వామ్య దేశంతో ద్వైపాక్షిక సంబంధాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన మైగ్రేషన్ అబ్జర్వేటరీ నిపుణుడు డాక్టర్ పీటర్ వాల్ష్ మాట్లాడుతూ %ా% " యూకే వీసా వ్యవస్థను అత్యధికంగా వినియోగించుకుంటున్న దేశాల్లో భారత్ ఒకటి. ఇలాంటి బెదిరింపు ధోరణిని భారత్ తేలిగ్గా తీసుకోదు. ఇది ఇరు దేశాల మధ్య వాణిజ్య, విద్యా సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది " అని అభిప్రాయపడ్డారు.

కఠిన చర్యలకు వెనుకాడబోం : బ్రిటన్ అయితేబ్రిటన్ మాత్రం ఈ సమస్యనుపరిష్కరించడానికిఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని, అవసరమైతే ఏ దేశానికైనా వీసాలను ఆయుధంగా ప్రయోగించడానికి సిద్ధమని యెవెట్ కూపర్ స్పష్టం చేశారు. దీంతో బ్రిటన్‌లో చదువు, ఉద్యోగాల కోసం వెళ్లాలను కుంటున్న లక్షలాది మంది భారతీయుల్లో ఆందోళన నెలకొంది.

# ఎంపీనే బురిడి కొట్టించారు!

కాకినాడ,తెలంగాణ దిశ :ఏపీలో సైబర్ నేరాలకుఅడ్డూ అదుపూ లేకుండా పోతోంది. అనునిత్యం ఎక్కడో ఒకచోట సైబర్ నేరం నమోదు అవుతూ వస్తోంది. సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు అందరూ సైబర్ నేరాల బాధితులే. పోలీసులు అనేక రూపాల్లో అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో చలనం లేదు. సైబర్ నేరాల బారిన పడుతూనే ఉన్నారు. మొన్నటికీ మొన్న ఏపీ మంత్రి అల్లుడు ఒకరు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డారు. లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నారు. ఇప్పుడు తాజాగా కాకినాడ జనసేన ఎంపి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. ఏకంగా రూ.92.5 లక్షలు కొల్లగొట్టారు. వాట్సాప్ ప్రొఫైల్ పిక్చర్ మార్చి ఈ ఘటనకు పాల్పడ్డారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.పూ ర్వాశ్రమంలో తంగేళ్ల ఉదయ శ్రీనివాస్( టీ టైమ్ వ్యవస్థాపకుడు. మొన్నటి ఎన్నికల్లో కాకినాడ నుంచి జనసేన తరఫున పోటీ చేసి గెలిచారు. అయితే తాజాగా ఈ టైం సిఎఫ్ఓ శ్రీనివాసరావు గంగిశెట్టి కి ఓ సైబర్ మోసగాడు వాట్సాప్ లో కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్ ప్రొఫైల్ పిక్చర్ పెట్టుకుని మెసేజ్ చేశాడు. మొదట ఆగస్టు 22న శ్రీనివాసరావుకు మెసేజ్ పంపాడు. అది తన కొత్త నెంబర్ అని పరిచయం చేసుకున్నాడు. అయితే అది తన బాస్ ఉదయ శ్రీనివాస్ నెంబర్ అని శ్రీనివాస్ నమ్మాడు. ఈ క్రమంలో ఆ సైబర్ మోసగాడు ఎంపీ ఉదయ శ్రీనివాస్ పేరు చెప్పి అత్యవసరంగా డబ్బులు కావాలన్నాడు. కొన్ని వారాలపాటు శ్రీనివాసరావు తో వందల్లా బ్యాంక్ అకౌంట్లకు డబ్బులు పంపమని చెప్పాడు. శ్రీనివాసరావు కూడా తన యజమాని డబ్బులు పంపమని భావించి.. 11 సార్లు ఏకంగా రూ.92.5 లక్షలు అదేవిధంగా ట్రాన్స్ఫర్ చేశారు. అయితే సెప్టెంబర్ 8న ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాసులు సిఎఫ్ఓ శ్రీనివాసరావు కలుసుకోవడంతో అసలు విషయం బయటపడింది. అటువంటి రిక్వెస్ట్ తానేది ఫోన్లో చేయలేదని ఎంపీ చెప్పడంతో సైబర్ మోసానికి గురయ్యానని శ్రీనివాసరావు ఒక నిర్ణయానికి వచ్చారు.

వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాదులోని సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంపీ పేరుతో ఈ మోసం జరగడంతో పోలీసులు సీరియస్ గా తీసుకున్నారు. అయితే ఆలస్యంగా ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇప్పటివరకు ఏడు లక్షల రూపాయలను మాత్రమే ఫ్రీజ్ చేయగలిగారు. మిగిలిన డబ్బును వెనక్కి తీసుకురావడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ డబ్బులు ఎవరి బ్యాంకు ఖాతాల్లోకి వెళ్లాయో తెలుసుకునేందుకు బ్యాంక్ రికార్డులు, కాల్ డేటా రికార్డులు, ఐపీ అడ్రస్లను పరిశీలిస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు. సాక్షాత్తు ఒక ఎంపీకి పరిస్థితి వచ్చిందంటే.. సామాన్యుడి దుస్థితి ఏంటన్న ప్రశ్న వినిపిస్తోంది.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో గల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు సెంటినరీ కాలని లోని జోన్–2 ఏరియాలో గల క్వార్టర్స్ లో ప్రతి ఇంటింటికీ వెళ్ళి పరిసరాల పరిశుభ్రత గురించి వారికి వివరించి, పరిసరాలలో అపరిశుభ్రంగా ఉండటం వలన ఈగలు, దోమల సంఖ్య పెరిగి వైరల్ ఫివర్స్ రావడం జరుగుతుందని, దీని వల్ల అందరూ అనారోగ్యం నకు గురికావడం జరుగుతుందని, అలా జరగకుండా ఉండాలంటే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వారికి వివరించడం జరిగింది. అదేవిధంగా నాగేపల్లి చౌరస్తాలో ప్రతి దుకాణం లోకి వెళ్లి దుకాణ యజమానికి మరియు వినియోగదారులకు ప్లాస్టిక్ వినియోగం వలన జరిగే అనర్థాలను వివరించి, ప్లాస్టిక్ వాడడం వలన మన దేశం లో రోజు రోజుకు చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. నాగేపల్లి చౌరస్తా లో వినియోగదారులందరికీ నృత్య రూపంలో మరియు పాటల రూపంలో అందరికీ అర్థమయ్యేలా ప్లాస్టిక్ వాడకం ను తగ్గించి, బట్ట సంచులను వాడాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ భూతం వేషధారణలో ఉన్న అబ్బాయి రిత్విక్ ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాడు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతి రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.




# సినిమా..

## మృణాల్ బ్యూటీ సీక్రెట్ ఇదే..!



## శరవేగంగా పెద్ది షూటింగ్

గేమ్ ఛేంజర్' సినిమాతో ఈ ఏడాది పెద్దగా ఆకట్టుకోలేని రామ్‌చరణ్ ఇప్పుడు తన నెక్స్ట్ సినిమాతో మళ్ళీ మాస్‌ను ఉర్రూతలూగించేందుకు రెడీ అవుతున్నారు. ప్రస్తుతం చరణ్ 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమాలో నటిస్తున్నారు. ఇది ఒక విలేజ్ స్పోర్ట్స్ రివెంజ్ డ్రామాగా రూపొందుతోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది. రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్స్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇక కర్ణాటకలోని మైసూరు ప్రాంతంలో వెయ్యి మందికి పైగా డ్యాన్సర్లతో షూట్ చేశారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో తెరకెక్కిన ఈ పాట సినిమాకే హైలైట్ కానుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా వచ్చే మార్చి 27న వరల్డ్ వైడ్‌గా విడుదల చేయాలని టీమ్ ప్లాన్ చేసింది. కాగా, దసరా పండుగ సందర్భంగా 'పెద్ది' నుంచి ఓ మ్యూజికల్ సింగిల్ విడుదల చేయనున్నట్లు- సమాచారం. ఇప్పటికే రామ్‌చరణ్ ఆ పాటను విన్నట్టు-, అది అద్భుతంగా ఉందని మెచ్చుకున్నట్టు సమాచారం. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ- జాన్వీ కపూర్ నటిస్తుండగా, సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్ పనిచేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కు ప్రేక్షకుల నుంచి విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా రామ్‌చరణ్ క్రికెట్ షాట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. కొంతమంది అంతర్జాతీయ క్రికెటర్లు కూడా దానిని రీ-క్రియేట్ చేయడంతో, సినిమా పట్ల ఆసక్తి మరింత పెరిగింది. రామ్‌చరణ్ అభిమానులు 'గేమ్ ఛేంజర్' ఫ్లాప్ తరువాత ఈ సినిమాపైనే ఆశలు పెట్టుకున్నారు. సుకుమార్ శిష్యుడు డైరెక్ట్ చేస్తుండటం, కథలో విలేజ్ బ్యాక్‌డ్రాప్, క్రికెట్, రివెంజ్ అంశాలు ఉండటంతో పాటు-, ఏఆర్ రెహమాన్ సంగీతం మేజర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. దసరా సీజన్‌లో మెగాస్టార్ చిరంజీవి తన కొత్త సినిమా షూటింగ్ ప్రారంభించనున్నట్టు- సమాచారం. బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రం 'వాల్తేరు వీరయ్య' తరువాత వారి రెండో కాంబో కావడం విశేషం. దీంతో దసరాకి తండ్రి, కొడుకులిద్దరూ మెగా ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇవ్వనున్నట్టు- గాసిప్ ఫిలింనగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది.


'సీతారామం'తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి మృణాల్ ఠాకూర్. అభినయంతో పాటు సహజ సౌందర్యంతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నది. చాలామంది బయటకు వచ్చిన సందర్భాల్లో మేకప్ లుక్‌లో కనిపిస్తుంటారు. కానీ, వారికి భిన్నంగా మృణాల్ మాత్రం నేచురల్‌గానే కనిపిస్తుంది. ఈ బ్యూటీ చర్మం ఎప్పుడూ కాంతివంతంగానే మెరుస్తూ ఉంటుంది. అయితే, తన బ్యూటీ సీక్రెట్‌ను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో షేర్ చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోలో మృణాల్ తాను రాత్రి పడుకునే ముందు ముఖానికి ఓ ఆయిల్‌ను అప్లయ్ చేసుకుంటానని చెప్పింది. ఆ ఆయిల్ వాడటాన్ని తన తల్లి సలహాతోనే ప్రారంభించానని చెప్పింది. అదే విషయాన్ని తల్లిని అడిగి మరింత వివరించాలని కోరింది. ఇంతకీ ఆ నూనే ఖరీదైన దేమీ కాదు. అందరూ వినియోగించే బాదం నూనే అని చెప్పింది. తన తల్లి సూచించిన ఈ చిట్కా తన చర్మానికి విశేషమైన కాంతిని ఇస్తుందని మృణాల్ చెప్పుకొచ్చింది. బాదం నూనెలో విటమిన్-ఈ, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు, ప్రొటీన్లు, ఇతర ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది సహజ మాయిశ్చరైజర్‌లా పని చేస్తుంది. అంతేకాక, యాంటీ-ఏజింగ్ లక్షణాలు ఉండటం వల్ల చర్మం యువకంగా కనిపించడానికి తోడ్పడుతుంది. వయస్సు ప్రభావాలు తొందరగా కనిపించకుండా అడ్డుకుంటుంది. ఇక కళ్ల కింద కనిపించే నలుపు వలయాలు, చర్మం ఉబ్బినట్లు కనిపించే సమస్యలకు కూడా బాదం నూనె సమర్ధంగా పని చేస్తుంది. ఆ భాగంలో మృదువుగా మసాజ్ చేయడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తాయని సౌందర్య నిపుణులు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా.. మృణాల్ ఖరీదైన కొనుగోలు చేయడం ఏమాత్రం నచ్చదట. ఖరీదైన బట్టలు కొనుగోలు చేసినా వాటితో ఎలాంటి ఉపయోగం లేకుండా దాచి ఉంచాల్సి వస్తుందని అభిప్రాయపడింది.

ఇప్పటి వరకు తాను కొనుగోలు చేసిన ఖరీదైన డ్రెస్ రూ.2వేలు మాత్రమేనని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. స్టార్ హీరోయిన్ అయినా తక్కువ ధరల్లోనే డ్రెస్‌లు కొనుగోలు చేస్తానని చెప్పడంతో అందరూ షాక్ అవుతున్నారు. మృణాల్ ఠాకూర్ మూవీ ఈవెంట్స్, ఇతర ఫంక్షన్లకు హాజరైన సందర్భంలోనే ఖరీదైన వస్త్రాలను ధరిస్తుండగా.. వాటిని రెంట్ తీసుకొని ధరిస్తుందట.

భారీ ధర దుస్తులను కొనుగోలు చేయడం నచ్చదని.. బదులుగా ఆ డబ్బులను ఫుడ్, ప్రాపర్టీస్ కొనుగోలు చేసేందుకు ఖర్చు చేస్తానని చెప్పడం విశేషం. మృణాల్ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. మృణాల్ మరాఠీ కుటుంబంలో పుట్టి పెరిగింది. 2012 ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. కెరియర్ ప్రారంభంలో టీవీల్లో నటించింది.

## పెళ్లి ఎప్పుడో చెప్పిన జాన్వీ కపూర్..!

అలనాటి అందాల తార శ్రీదేవి తనయ, బాలీవుడ్ బ్యూటీ జాహ్నవి కపూర్ ఎట్టకేలకు తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఊహాగానాలపై స్పందించిందింది. శిఖర్‌పహారియాతో పెళ్లి వార్తలు తెగహల్‌చల్ చేస్తున్న వేళ.. ఈ వార్తలన్నింటికి చెక్ పెట్టింది. పెళ్లికి ఇంకా సమయం ఉందని.. ప్రస్తుతం తన దృష్టి అంతా నటనపైనే ఉందని స్పష్టం చేసింది. ఇటీవల ముంబయిలో జరిగిన 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ సందర్భంగా జాన్వీ మీడియాతో మాట్లాడింది. ఈ సందర్భంగా 'మీ పెళ్లి ఎప్పుడు ' అనే ప్రశ్న ఎదురైంది. దీనికి జాన్వీ స్పందిస్తూ.. 'ఇప్పుడంతా నా కెరీర్ మీదే ఫోకస్ ఉంది. పెళ్లికి సమయం ఉంది' అంటూ బదులిచ్చింది. అయితే,శిఖర్ పహారియాతో జాన్వీ రిలేషన్‌లో ఉన్నట్లుగా గతకొంత కాలంగా వార్తలు వస్తున్నాయి. మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్ కుమార్ షిండే మనవడు శిఖర్‌తో జాన్వీ పలు ఈవెంట్లకు కలిసి రావడం, ఆమెఫోన్ స్పీడ్ డయల్‌లో శిఖర్ పేరు ఉండడం, 'శిఖు' పేరుతో ఉన్న నెక్లెస్ ఆమె ధరించడంతో ప్రస్తుతం ఇద్దరు రిలేషన్‌లో ఉన్నారని.. త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని వార్తలు వచ్చాయి. ఈ తాజా ఈవెంట్‌లో శిఖర్ పేరును ప్రస్తావించకపోయినా.. పెళ్లి వార్తలపై జాన్వీఓక్లియర్ స్టేట్‌మెంట్ ఇవ్వడం ఇదే తొలిసారి. ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే శశాంక్ ఖైతాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' సినిమాలో జాన్వీ వరుణ్‌ధావన్‌తో కలిసి నటిస్తున్నది. ఈ సినిమా అక్టోబర్2న థియేటర్లలో విడుదల కానుంది. అలాగే, గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ తోతెలుగులో 'పెద్ది' సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే.



## ఓవర్ నైట్ స్టార్ గా తేజ...

తేజ సజ్జ హీరో గా నటించిన 'మిరాయ్' చిత్రం రీసెంట్ గానే భారీ అంచనాల నడుమ విడుదలై బాక్స్ ఆఫీస్ వద్ద అద్భుతాలను నెలకొల్పుతూ ముందుకు దూసుకుపోతుంది. నిర్మాతలు చెప్తున్నా లెక్కల ప్రకారం ఈ సినిమాకు రెండు రోజుల్లో వరల్డ్ వైడ్ గా 55 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లు వచ్చాయి. సాధారణంగా ఏ సినిమా నిర్మాత అయినా వచ్చిన డబ్బులకంటే ఎక్కువ డబ్బులు వచ్చినట్టుగా పోస్టర్స్ లో వేసి చూపిస్తుంటారు. కానీ మిరాయ్ నిర్మాతలు అలా చేయడం లేదు.ఎంత కలెక్షన్స్ అయితే వచ్చాయో, అంతే పోస్టర్స్ లో వేసే ప్రయత్నం చేశారు. 55 కోట్ల రూపాయిల గ్రాస్ అని చెప్పారు కానీ, ట్రేడ్ విశ్లేషకులు అందిస్తున్న లెక్కల ప్రకారం చూస్తే ఈ చిత్రానికి రెండు రోజుల్లో వచ్చింది 53 కోట్ల రూపాయిలు మాత్రమే. కానీ తెలుగు రాష్ట్రాల్లో మాత్రం మొదటిరోజు కంటే ఎక్కువ వసూళ్లు వచ్చాయని అంటున్నారు.ట్రేడ్ పండితులు అందిస్తున్న సమాచారం ప్రకారం ఈ చిత్రానికి రెండవ రోజున 8 కోట్ల 20 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయట. ఈ ఏడాది భారీ అంచనాల నడుమ విడుదలైన రామ్ చరణ్ గేమ్ చేంజర్, పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' చిత్రాలకు కూడా ఈ రేంజ్ షేర్ వసూళ్లు రాకపోవడం గమనార్హం. మూడవ రోజు అయితే రెండవ రోజు కంటే అద్భుతమైన ఆక్యుపెన్సీలు నమోదు అవుతున్నాయట. ప్రస్తుతం ఉన్న ట్రెండ్ ప్రకారం చూస్తే ఈ చిత్రం కచ్చితంగా రెండవ రోజు కంటే ఎక్కువ వసూళ్లను రాబట్టే అవకాశం ఉందని అంటున్నారు. హిందీ లో కూడా రెండవ రోజున ఈ చిత్రానికి 3 కోట్ల 50 లక్షల రూపాయిల నెట్ వసూళ్లను రాబట్టింది. గ్రాస్ వసూళ్లు దాదాపుగా 5 కోట్ల రూపాయిల వరకు ఉండొచ్చు. ఓవర్సీస్‌లో కూడా రెండవ రోజున ఈచిత్రం హాఫ్ మిలియన్ డాలర్ల గ్రాస్ వసూళ్లను రాబట్టినట్టు సమాచారం. ఓవరాల్ గా చూస్తే రెండవ రోజున ఈచిత్రానికి 27కోట్ల రూపాయిల వరకు గ్రాస్ వసూళ్లు వచ్చాయని అంటున్నారు. 30కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వస్తాయట. అలా ఓవరాల్ గా ఈ చిత్రం మూడు రోజుల్లో 85 కోట్ల రూపాయలకు పైగాగ్రాస్ వసూళ్లను రాబట్టే సూచనలు కనిపిస్తున్నాయని, బ్రేక్ ఈవెన్ మార్కుని కూడా అవలీల గా దాటిందని అంటున్నారు.




## ఉత్తుత్తి మాటలే..




న్యూఢిల్లీ, ఆగస్టు 23: దేశానికి, దేశ ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చేందుకే ఈ సంస్కరణలంటూ ఊదరగొడుతూ వస్తున్న మోదీ సర్కారు.. గడిచిన 11 ఏండ్లలో తీసుకున్న ఏ నిర్ణయంతోనూ ఎవరికీ పెద్దగా ఒనగూరిన లాభమేమీ లేకపోవడం గమనార్హం. ముఖ్యంగా పన్నుల విషయానికొస్తే.. కార్పొరేషన్, వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ)ల్లో కోతలు పెట్టినా.. సంపద పన్ను రద్దు చేసినా ఫలితం శూన్యమేనన్న అభిప్రాయాలు న్నా యి. ఎల్‌టీసీజీ, కొత్త ఐటీ చట్టానిదీ ఇంతే. అన్నింటా తన వారికి, తన రాష్ట్రానికి పెద్దపీట వేయడం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకే చెల్లిందని చెప్పవచ్చు. గతంలో జరిగిన తన సౌదీ అరేబియా పర్యటనలో స్వరాష్ట్రం గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో ఆ దేశ సావరిన్ ఫండ్ పీఐఎఫ్ కార్యాలయం పెట్టేందుకు వీలుగా చట్టాన్నైతే సవరించేశారు మరి. డివిడెండ్, వడ్డీ, దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్నుల నుంచి పీఐఎఫ్‌కు మినహాయిం పు కల్పించడం విశేషం.

కేంద్రంలో మోదీ సర్కారు అధికారం లోకి వచ్చిన 2014-15 నుంచి 2024-25 వరకు ఈ పదేండ్లలో దేశ జీడీపీ కంటే డిమాండ్‌లో వాస్తవిక వృద్ధిరేటు సగటు తక్కువగానే ఉంటున్నది. జీడీపీ 6.2 శాతంగా ఉంటే.. వినియోగం వృద్ధి 6.1 శాతంగానే ఉన్నది. తయారీ రంగానిదీ ఇంతే. ఇక పొదుపు విషయానికొస్తే..

## గుడ్ న్యూస్ చెప్పిన ఇన్ఫోసిస్..




క్యూ1లో మెరుగైన పనితీరు నేపథ్యంలో ఉద్యోగులకు ఇన్ఫోసిస్ గుడ్ న్యూస్ చెప్పింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి పనితీరు ఆధారిత బోనస్లను ప్రకటించింది. ఆగస్టు నెల వేతనంతో పాటు అర్హులైన ఉద్యోగులకు సగటున 80 శాతం బోనస్ చెల్లించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఇన్ఫోసిస్ ఈ స్థాయిలో బోనస్‌ను ప్రకటించడం టెక్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. ఇన్ఫోసిస్ తమ కంపెనీ ఉద్యోగులకు పనితీరు ఆధారంగా ఈ చెల్లింపులు జరగనున్నట్లు పేర్కొంది. లెవల్ పీఎల్4 ఉద్యోగుల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి అత్యధికంగా 89 శాతం బోనస్ చెల్లించనున్నారు. అంచనాలు అందుకున్న ఉద్యోగులకు 80 శాతం చొప్పున చెల్లింపులు జరగనున్నాయి. లెవల్ పీఎల్, లెవల్ పీఎల్ 6 ఉద్యోగులకు 78-87 శాతం, 75-85 శాతం, పీఎల్4, పీఎల్, పీఎల్ కేటగిరీల్లోని ఉద్యోగులకు 80 శాతం, 75 శాతం, 70 శాతం చొప్పున బోనస్ చెల్లించనున్నట్లు పేర్కొంది. జులై 23న వెలువరించిన త్రైమాసిక ఫలితాల్లో ఇన్ఫోసిస్ అంచనాలను మించి రాణించింది. గతేడాదితో పోలిస్తే కంపెనీ నికర లాభం 8.7 శాతం వృద్ధి చెంది రూ.6921 కోట్లుగా నమోదైంది. ఆదాయం సైతం 7.5 శాతం వృద్ధితో రూ.42,279 కోట్లుగా పేర్కొంది. ఆగస్టు 20 నాటికి ఇన్ఫోసిస్ రూ. 6.20 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో దేశంలోని అతిపెద్ద ఐటీ సేవల సంస్థలలో ఒకటిగా నిలిచింది. స్టాక్ మార్కెట్‌లో కంపెనీ షేరు ధర రూ.1,495.10గా ముగిసింది.

## జియో యూజర్లకు బిగ్ షాక్..

ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో ఎంట్రీ లెవల్ ప్రీపెయిడ్ ప్లాన్‌లో పలు మార్పులు చేసింది. రూ.249 ధరలో 28 రోజుల పాటు రోజుకు 1 జీబీ డేటా అందించే ప్లాన్‌ను తాజాగా బంద్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇకపై 1.5 జీబీ/డే ప్లాన్‌లే బేస్ ఆప్షన్‌గా అందుబాటులో ఉండనున్నాయి. దీంతో జియో యూజర్లు ఎక్కువ డేటా ఉన్న ఆప్షన్ల వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా, ఇప్పటికే జియోలో

ఈ ప్లాన్ అమల్లోకి వచ్చింది. జియో వెబ్‌సైట్‌లో 1జీబీ ఎంట్రీ లెవల్ ప్లాన్ కనిపించడం లేదు.

దీంతో ప్రస్తుతం 28 రోజులకు రూ.299తో 1.5 జీబీ/డే, రూ.349తో 2 జీబీ/డే ప్లాన్లు మాత్రమే అందుబాటులో కొనసాగుతున్నాయి. ఇక, జియో తాజా నిర్ణయంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ నిర్ణయం ఎంతో మందికి అధిక భారం కావొచ్చని, ఇష్టానుసారంగా ప్లాన్స్ ఛేంజ్ చేసుకుంటే పోతుంటే.. ట్రాయ్ నిద్రపోతుందా అని సోషల్ మీడియాలో వినియోగదారులు కామెంట్స్ పెడుతున్నాయి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215